నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 18-11-2022 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 82 పేజీలు:6 వెల: రూ.1/-

బిసి భవన్ నిర్మాణ పనులు పూర్తి చేయాలి

ఖమ్మం, నవంబర్ 17: (నేటినిజం ప్రతినిధి): బిసి భవన్ నిర్మాణ పనుల్లో వేగం పెంచి, త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. గురువారం కలెక్టర్ ఎన్టీఆర్ సర్కిల్, బైపాస్ రోడ్ లో నిర్మిస్తున్న బిసి భవన్ నిర్మాణ పురోగతిని క్షేత్ర స్థాయిలో సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్ తో కలిసి పరిశీలించారు. రూ. 2 కోట్ల వ్యయ అంచనాలతో నిర్మిస్తున్న భవనం స్లాబ్ లెవల్ కి చేరుకున్నట్లు, పనుల్లో వేగం పెంచాలని ఆయన అన్నారు. అనంతరం బిసి స్టడీ సర్కిల్ లో ఉద్యోగార్థులకు ఇస్తున్న శిక్షణా తరగతులను కలెక్టర్ పరిశీలించారు. ఉద్యోగార్థులతో వారు ఏ సంవత్సరం డిగ్రీ పూర్తి చేసింది. కోచింగ్ ఎలా ఉంది అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బిసి స్టడీ సర్కిల్ ద్వారా 90 మంది నిరుద్యోగ యువతీయువకులకు గ్రూప్-ఎఎఎ, ఎఎ ఉద్యోగాలకు కోచింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. క్లాసెస్ అన్ని హాజరు కావాలని, వీక్లి పరీక్షలు తప్పక వ్రాయాలని అన్నారు. చదివిన వాటిని ఏకీకృతం చేసి, సవరించుకుంటే జ్ఞాపకం వుంటాయని, ఉన్నదాంట్లోనే ఉత్తమ ప్రదర్శన చేయాలని అన్నారు. అసలు పరీక్షల లాగా మాక్ పరీక్షలు కూడా క్రమశిక్షణ, అంతే ప్రాముఖ్యత నిచ్చి వ్రాయాలని, అప్పుడే విజయం సులువవుతుందని ఆయన తెలిపారు. ఎస్సై, పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ఈవెంట్స్ పై శిక్షణ ఇస్తున్నట్లు ఆయన అన్నారు.

తెలంగాణలో కొత్తగా 15 ఫైర్ స్టేషన్లకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్, నవంబర్ 17: అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా ఫైర్ స్టేషన్లు, అగ్నిమాపక సిబ్బంది ఎంతగానో కృషి చేస్తారు. తెలంగాణలో కొత్తగా 15 ఫైర్ స్టేషన్లను ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు అగ్నిమాపక కేంద్రాలు, ఉద్యోగాలను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఫైర్ స్టేషన్ల నిర్వహణకు అవసరమైన 382 ఉద్యోగాలను కూడా మంజూరుచేసింది. ఫైర్ స్టేషన్లు లేని నియోజకవర్గాల్లో ఏర్పాటు చేయనుంది. కొత్తగా మంజూరైన ఉద్యోగాల్లో 367 పోస్టులను శాశ్వత ప్రాతిపదికన, 15 పోస్టులను అవుట్ సోర్సింగ్ పద్ధతిలో తీసుకోనున్నారు. కొత్తగా మల్కాజిగిరి, ఎల్బీ నగర్, రాజేంద్రనగర్, షాద్‌నగర్, అంబర్‌పేట, చాంద్రాయణగుట్ట, జూబ్లీహిల్స్, స్టేషన్ ఘనపూర్, దోర్నకల్, నర్సాపూర్, హుస్నాబాద్, కల్వకుర్తి, బాల్కొండ, ధర్మపురి, పినపాక నియోజకవర్గాల్లో కొత్తగా అగ్నిమాపక కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.

నూతన సచివాలయాన్ని పరిశీలిస్తున్న సీఎం కేసీఆర్

హైదరాబాద్, నవంబర్ 17: ముఖ్యమంత్రి కేసీఆర్ నూతన సచివాలయానికి చేరుకున్నారు. సచివాలయ నిర్మాణ పనుల పురోగతిని కేసీఆర్ పరిశీలిస్తున్నారు. సీఎం కేసీఆర్ వెంట రోడ్లు, భవనాల శాఖ మంత్రి ప్రశాంత్ రెడ్డి, ఆర్ అండ్ బీ శాఖ అధికారులతో పాటు తదితరులు ఉన్నారు. సచివాలయ నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావొచ్చాయి. ఇంటీరియర్ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మూడు షిఫ్టుల్లో పనులు జరుగుతున్నాయి. సచివాలయానికి వచ్చే కంటే ముందు ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్ శాఖ అధికారులతో తెలంగాణ లో రోడ్ల పరిస్థితిపై కేసీఆర్ సమీక్షించారు. అనంతరం ప్రజారోగ్యంపై వైద్యారోగ్య శాఖ మంత్రి, అధికారులతో సీఎం చర్చించారు. ఆ తర్వాత కొత్త సచివాలయం ప్రాంగణానికి కేసీఆర్ చేరుకుని పనులను పరిశీలిస్తున్నారు. 150-200 ఏండ్ల వరకు చెక్కుచెదరకుండా ఉండేలా సెక్రటేరియట్‌ను నిర్మిస్తున్నారు. దీనికోసం అధికారులు, నిర్మాణ సంస్థ ప్రత్యేక దృష్టి సారించాయి. చాంబర్ల నిర్మాణం, ఇంటీరియర్ డిజైన్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్, వర్క్‌స్టేషన్ ఏర్పాటు, కలరింగ్, ఫ్లోరింగ్, మార్బుల్స్, పోర్టికోల నిర్మాణం.. ఇలా వివిధ రకాల పనులన్నీ ఏకకాలంలో చేపడుతున్నారు. రూ.617 కోట్లతో నిర్మితమవుతున్న నూతన సచివాలయ భవనాన్ని గ్రీన్ బిల్డింగ్ కాన్సెప్ట్ పద్ధతిలో నిర్మిస్తున్నారు. నూతన సచివాలయ భవనంలోకి సహజమైన గాలి, వెలుతురు వచ్చేలా నిర్మిస్తున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా జనవరి 18 నుంచి కంటి వెలుగు కార్యక్రమం

హైదరాబాద్, నవంబర్ 17: : రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే ఏడాది జనవరి 18 నుంచి కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని మళ్లీ నిర్వహించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారు. కంటి వెలుగు కార్యక్రమం అమలు తీరుపై సీఎం కేసీఆర్ ఇవాళ సమీక్షించారు. ప్రజారోగ్యంపై వైద్య ఆరోగ్య శాఖ, ఇతర మంత్రులతో కేసీఆర్ సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా కంటి వెలుగు కార్యక్రమం మళ్లీ నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు.

కంటి వెలుగు పథకాన్ని 2018, ఆగస్టు 15న మెదక్ జిల్లా మల్కాపూర్‌లో సీఎం కేసీఆర్ ప్రారంభించిన విషయం విదితమే. అయితే.. ఈ పథకం ఐదు నెలల పాటు కొనసాగింది. కంటి వెలుగు కోసం ప్రభుత్వం రూ.106 కోట్లు ఖర్చు చేసింది కూడా. అయితే.. పథకంలో భాగంగా కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి కళ్లద్దాలతో పాటు మందులు కూడా పంపిణీ చేసింది ప్రభుత్వం. ఈ కార్యక్రమం అప్పుడు విజయవంతమైంది.

బాధిత కుటుంబాలకు బియ్యాన్ని అందజేసిన అది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 17: (నేటినిజం ప్రతినిధి): కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలో ఇటీవల మృతి చెందిన కుటుంబాలను గురువారంకొనరావుపేట కాంగ్రెస్ పార్టీ నాయకులు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం వేములవాడ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆది శ్రీనివాస్ పంపించిన బియ్యాన్ని మృతుల కుటుంబాలకు అందజేశారు. మృతుల కుటుంబాలకు ఆది శ్రీనివాస్ ఎల్లవేళల అండగా ఉంటారని వారు తెలిపారు ఈ కార్యక్రమంలోమండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఫిరోజ్ షేక్ పాషా, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి కచ్చకాయల ఎల్లయ్య గ్రామ శాఖ అధ్యక్షులు నీరటి సంజీవ్ కచ్చకయాల బాలరాజు, వంగల శ్రీనివాస్, దొబ్బల దేవయ్య, బాధవేని కనకయ్య,సుంకరి రెడ్డి,బుర్ర రమేష్, ఉప్పుల గంగయ్య, నీరటి సురేష్, ఎరవెల్లి సురేష్, అల్వాల అంజయ్య సోమిశెట్టి వెంకన్న, దొబ్బల లింగయ్య లు పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి సహాయ, సహకారాలు అందిస్తా : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, నవంబర్ 17: నిజామాబాద్ జిల్లాలో క్రీడల అభివృద్ధికి, జిల్లా ఒలింపిక్ సంఘం కార్యక్రమాలకు తనవంతుగా సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. నిజామాబాద్ జిల్లా ఒలింపిక్స్ సంఘం నూతన కార్యవర్గం ప్రతినిధులు గురువారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను మర్యాదపూర్వకంగా కలిశారు. సంఘం అధ్యక్షుడు ఈగ సంజీవరెడ్డి, ఉపాధ్యక్షులు బాజిరెడ్డి జగన్ మోహన్, ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య, కోశాధికారి జివి భూమారెడ్డి తదితరులు ఎమ్మెల్సీకి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఈ సందర్భంగా సంఘం నూతన కార్యవర్గానికి ఎమ్మెల్సీ కవిత అభినందనలు తెలియజేస్తూ జిల్లాలోని క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణించే విధంగా జిల్లా ఒలింపిక్ సంఘం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యుడు యాసిన్, రాష్ట్ర సెపక్ తక్రా అధ్యక్షుడు నల్లవెల్లి కరుణాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గాధారి సంజీవ్ రెడ్డి, జిల్లా కబడ్డీ కోచ్ మీసాల ప్రశాంత్ కుమార్, హైదరాబాద్ అర్చరీ ప్రధాన కార్యదర్శి అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

సింబల్ ఆఫ్ చారిటీగా కొండపాక విద్యా వైద్యాలయం: మంత్రి హరీశ్ రావు

సిద్దిపేట, నవంబర్ 17:: సిద్దిపేటలోని కొండపాకలో శ్రీ సత్యసాయి సంజీవని బాలల గుండె చికిత్స, పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేయడం పట్ల మంత్రి హరీశ్ రావు ఆనందం వ్యక్తంచేశారు. దక్షిణ భారతదేశ ప్రజలకు ఉచితంగా గుండె శస్త్ర చికిత్సలు చేయడానికి ఈ సెంటర్‌ను నెలకొల్పడంతో తెలంగాణ ప్రత్యేకతను సాధించిందన్నారు. కొండపాకలో కొత్తగా నిర్మించిన శ్రీ సత్యసాయి సంజీవని బాలల గుండె చికిత్స, పరిశోధన కేంద్రాన్ని సద్గురు మధుసూదన్‌సాయితో కలిసి మంత్రి హరీశ్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. ప్రతి వంద మంది చిన్నారుల్లో ఒకరు గుండె సంబంధిత వ్యాధితో మృత్యువాతపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో చికిత్సా కేంద్రాన్ని ఏర్పాటుచేయాలని సద్గురు మధుసూదన్ సాయి గారిని కోరగానే సానుకూలంగా స్పందించారని, కొండపాకలో బాలల గుండె శస్త్ర చికిత్స కేంద్రాన్ని నెలకొల్పారన్నారు.

ఈ కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున అనివిధాల సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. మానవ సేవయే మాధవ సేవగా భావించే మధుసూదన్ సాయి చేతుల మీదుగా విద్యాలయాలు, వైద్యాలయాలను ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. కొండపాక విద్యా వైద్యాలయం సింబల్ ఆఫ్ చారిటీగా నిలుస్తున్నదని తెలిపారు. ఈ కేంద్రాన్ని ఇక్కడ ఏర్పాటుచేసేలా కృషి చేసిన ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాలకు ఈ వైద్యాలయం ద్వారా కావాల్సిన వైద్య చికిత్సలు అందిస్తామని శ్రీ సద్గురు మధుసూదన్ సత్యసాయి వెల్లడించారు. నవంబర్ 23న సత్యసాయిబాబా జన్మదినం సందర్భంగా నేడు ఈ వైద్యాలయాన్ని ప్రారంభించుకున్నామని చెప్పారు. మనుషుల్లో ఉండే భగవంతుని గుర్తించడమే నిజమైన మాధవ సేవ అన్నారు.

రికార్డుస్థాయిలో పూర్తవుతున్న.. తెలంగాణలో చేపట్టిన ప్రతిష్టాత్మక నిర్మాణపనులు.. మంత్రి శ్రీనివాస్ గౌడ్

హైదరాబాద్, నవంబర్ 17: సమైక్య రాష్ట్రంలో ఒక్క బ్రిడ్జి నిర్మాణానికి 12ఏళ్ల సమయం పట్టిందని..ఇప్పుడు అక్కడే సమాంతరంగా నిర్మిస్తున్న రెండో బ్రిడ్జి నిర్మాణం పనులు కేవలం 12 నెలల్లో పూర్తి చేస్తున్నాం అన్నారు మంత్రి శ్రీనివాస్ గౌడ్. అప్పనపల్లి వద్ద నిర్మాణంలో ఉన్న రెండో బ్రిడ్జి పనులను సంబంధిత అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు .తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన ప్రతిష్టాత్మక నిర్మాణపనులు రికార్డు స్థాయిల్లో పూర్తవుతున్నాయన్నారు. వచ్చే ఏడాది జనవరి చివరి నాటికి పనులు పూర్తి చేసి ఫిబ్రవరిలో బ్రిడ్జి ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలని ఆదేశించామని' ఆయన వివరించారు. తెలంగాణకు ముందు కనీసం ఒక్క బ్రిడ్జి కూడా లేకపోవడంతో నిత్యం గంట గంటకోసారి రైల్వే గేటు పడడం వల్ల రాకపోకలకు తీవ్రంగా అంతరాయం ఏర్పడేదని మంత్రి తెలిపారు.

అత్యవసర చికిత్స కోసం హైదరాబాద్ వెళ్లాలనుకునే వారి పరిస్థితి మరీ దయనీయంగా ఉండేదని గుర్తు చేశారు. కేవలం ఏడాది కాలాన్ని లక్ష్యంగా నిర్దేశించుకుని రెండో బ్రిడ్జి నిర్మాణం పనులు ప్రారంభించినట్లు తెలిపారు. రెండో బ్రిడ్జి అందుబాటులోకి వచ్చిన తర్వాత మహబూబ్ నగర్ నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు మొత్తం నాలుగు లైన్ల రహదారి అందుబాటులోకి వచ్చినట్లు అవుతుందని వెల్లడించారు. విమానాశ్రయానికి కేవలం గంట వ్యవధిలో ప్రయాణించే వెసులు బాటు కలుగుతుందని తెలిపారు. డిసెంబర్ చివరి నాటికి బ్రిడ్జి పనులు మొత్తం పూర్తవుతుండగా రైల్వే శాఖ ఆధ్వర్యంలో నిర్మించాల్సిన స్లాబ్ గడ్డర్లు ఆలస్యం అవ్వడం వల్ల ఒక నెల రోజుల సమయం అదనంగా పడుతోందని అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు : ఎమ్మెల్యే కోరుకంటి చందర్

కరీంనగర్, నవంబర్ 17: (నేటినిజం ప్రతినిధి): మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దే నని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. గోదావరి నదిలో రూ. 40లక్షల విలువల గల చేప, రొయ్యపిల్లలను వదిలిన సందర్భంగా ఆయన మాట్లాడారు. టీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుతో రాష్ట్రం సస్యశ్యామలంగా మారుతుందని అన్నారు. పంటలకు సాగునీరు, పరిశ్రమలకు అవసరమైన నీరు, ప్రజలకు తాగునీరు అందుతుందన్నారు.

అంతేకాకుండా కాళేశ్వరంతో మత్స్య సంపద అభివృద్ధి చెందిదని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజాహిత సంక్షేమ పథకాలను అందిస్తుండడంతో ప్రతి ఇంట ఆనందం వెల్లివిరుస్తుందని అన్నారు. మత్స్యకారులకు ఆర్థిక భరోసా పెరిగిందని వెల్లడించారు.

రాష్ట్రంలోని అన్ని కులవృత్తులకు ప్రోత్సాహం అందిస్తూ వారికి అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామగుండం నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్,డిప్యూటీ మేయర్ నడిపల్లి అభిషేక రావు, డీఎఫ్ఓ భాస్కర్ నాయక్, కార్పొరేటర్లు, టీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోర్టు పోలియో జడ్జి, అడ్మిస్ట్రేషన్ రిజిస్టర్ ను కలిసిన బార్ అసోసియేషన్ నాయకులు

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 17: (నేటినిజం ప్రతినిధి): హైదరాబాద్ లో రాజన్న సిరిసిల్ల పోర్టు పోలియో జడ్జి, ఏనుగు సంతోష్ రెడ్డి అడ్మిస్ట్రేషన్ రిజిస్టర్ రమాకాంత్ ను గురువారం వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు వేముల సుధాకర్, కార్యదర్శి గుడిసె సదానందం, ఉపాధ్యక్షులు గడ్డం సత్యనారాయణ రెడ్డి, సీనియర్ న్యాయవాదులు నాగుల సత్యనారాయణ, పుత్తూరు అనిల్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసినారు. అనంతరం వేములవాడ అడిషనల్ కోర్టు, మరియు బార్ అసోసియేషన్ బిల్డింగు, సీనియర్ సివిల్ జడ్జి భవన నిర్మాణం కొరకు కోర్టు ప్రక్కన ఉన్న ఖాళీ స్థలం కేటాయించాలంటూ విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ ప్రభుత్వం చొరవతో కులవృత్తులకు పునర్జీవం : మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి : తెలంగాణ ప్రభుత్వం, ముఖ్య మంత్రి కేసీఆర్ తీసుకుంటున్న అనేక కార్యక్రమాల వల్ల కులవృత్తులు పునర్జీవం పోసుకుంటున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి తెలిపారు. వనపర్తి నియోజకవర్గం శ్రీరంగాపురం మండల కేంద్రంలోని రంగసముద్రంలో ప్రభుత్వ ఉచిత చేపల పంపిణీలో భాగంగా చెరువులో రొయ్యలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమైక్య రాష్ట్రంలో చెరువులు ఎండిపోయి, మత్స్యకారులు వలసపోయారని అన్నారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి మిషన్ కాకతీయ పథకం కింద చెరువులు నింపారని గుర్తు చేశారు. ఉచిత చేప పిల్లలు చెరువుల్లో విడిచి మత్స్యకారులకు ఉపాధి కల్పించారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రజలకు చేపల రూపంలో అందుబాటులో పౌష్టికాహారం,సబ్సిడీ గొర్రె పిల్లలతో గొల్ల కురుమలకు ఆర్థిక స్థిరత్వం కలుగుతుందని అన్నారు.

రైతుబంధు, రైతుబీమా, ఉచితంగా 24 గంటల కరంటు, సాగునీటి సౌకర్యంతో రైతులలో ఆత్మవిశ్వాసం పెరిగిందని వెల్లడించారు. రైతు ఏ కారణం చేత మరణించినా 10 రోజులలో రూ. 5 లక్షల పరిహారం అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని వివరించారు. తెలంగాణ అమలు చేస్తున్న పథకాలను కేంద్ర ప్రభుత్వం, ఇతర రాష్ట్రాలు పేర్లు మార్చి పథకాలు అమలు చేస్తున్నాయని ఆరోపించారు . ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ లోక్ నాథ్ రెడ్డి, టీఆర్ఎస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

చరిత్రలో నేటినిజం



(నవంబర్ 18 కమలనాథ్ జననం..) -రాధశ్రీ

సెల్:9494481210

ప్రపంచ జనాభా 800 కోట్లు దాటి దూసుకుపోతోంది

15 నవంబర్ 2022 రోజున ప్రపంచ జనాభా 8 బిలియన్ల (800 కోట్ల) మైలురాయి దాటిందని ఐక్యరాజ్యసమితి ప్రపంచ జనాభా అంచనా నివేదిక వెల్లడిస్తున్నది. మానవ అభివృద్ధి సూచికలో ఇదో ముఖ్య అధ్యాయంగా నిలుస్తుందని ఐరాస తెలిపింది. ప్రపంచ జనాభా 8 బిలియన్ల మార్కు దాటిన వేళ ఇండియా జనాభా 1.41 బిలియన్లకు చేరడం గమనార్హం. ప్రపంచ జనాభా 1804లో 1 బిలియన్, 1930లో 2 బిలియన్లు, 1960లో 3 బిలియన్లు, 1974లో 4 బిలియన్లు, 1987లో 5 బిలియన్లు, 1998లో 6 బిలియన్లు, 2021లో 7 బిలియన్ల మైలురాళ్ల మార్కును దాటింది. 2037 నాటికి 9 బిలియన్లు, 2058 నాటికి 10 బిలియన్లకు విశ్వ జనాభా చేరవచ్చని ఐరాస తెలుపుతున్నది. ప్రపంచ జనాభాలో 31 శాతం క్రిస్టియన్లు, 23 శాతం ముస్లిమ్స్, 15 శాతం హిందువులు, 7 శాతం భౌద్దులు, 6 శాతం గిరిజన జాతులు, 1 శాతం ఇతర మతస్తులు, 0.2 శాతం జూస్, 16 శాతం ఏ మతానికి చెందని వారు ఉన్నారు.

2023లో చైనాను అధిగమించనున్న ఇండియా జనాభా: ఐరాస వివరాల ప్రకారం 2019లో ప్రపంచ సగటు ఆయుర్దాయం 72.8 ఏండ్లు ఉండగా, 2050 నాటికి 77.2 ఏండ్లకు పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. గత 5 దశాబ్దాల్లో ప్రపంచ జనాభా రెట్టింపు కావడం, దాదాపు గత 12 ఏండ్లలో 1 బిలియన్ జనాభా పెరగడం (7 నుంచి 8 బిలియన్ల వరకు) గమనించాం. ఆసియా, ఆఫ్రికాలకు చెందిన అల్ప, మధ్య ఆదాయ దేశాల్లో జనాభా పెరుగుదల అధికంగా ఉన్నట్లు విశ్లేషించారు. ప్రపంచవ్యాప్తంగా సగటు మరణాల రేటు తగ్గడం, సగటు ఆయుర్దాయం పెరగడం కారణంగా జనాభా పెరుగుదల వ్యక్తం అవుతున్నది. 2023లో భారత జనాభా (1.41 బిలియన్లు) చైనా జనాభాను (1.45 బిలియన్లు) దాటి అత్యధిక జనాభా కలిగిన దేశాల జాబితాలో తొలి స్థానానికి చేరనుందని తెలుస్తున్నది. ఇండియా జనాభా క్రమంగా పెరిగితే, చైనా జనాభా తగ్గుతున్నదని గమనించారు. 2050 నాటికి ఇండియా జనాభా 1.67 బిలియన్లు, చైనా జనాభా 1.32 బిలియన్లకు చేరతాయని స్పష్టం చేసింది. 2020 నుంచి జనాభా పెరుగుదల రేటు కొంత తగ్గిందని, 1950లో ప్రతి మహిళకు జనన రేటు 5 ఉండగా, నేడు 2.3 వరకు పడిపోయిందని వివరిస్తున్నారు. 2050 నాటికి ఈ రేటు 2.1 వరకు పడిపోవచ్చని విశ్లేషించారు. 2080 తరువాత ప్రపంచ జనాభా 10.4 బిలియన్లు కలిగి 2100 వరకు స్థిరంగా ఉండవచ్చని అంచనా వేస్తున్నారు.

జనాభా విస్ఫోటన సవాళ్లు:

జనాభా విస్ఫోటన సంక్షోభ ఫలితంగా బిలియన్ల బడుగులు అసమానతల ఉచ్చులో చిక్కుకొని చిక్కిశల్యం అవుతున్నారు. నేడు ప్రపంచ మానవాళి ఎదుర్కొంటున్న వాతావరణ ప్రతికూల మార్పులు, విపత్తుల కల్లోలాలు, వడగాలులు, కార్చిచ్చులు, కరువుకాటకాలు, ఉక్రెయిన్ యుద్ధం, యూరోప్‌లో ద్రవ్యోల్బణ విష వలయంలో నలుగుతూ నరకాన్ని అనుభవిస్తున్నారు. 1999లో ఐరాస అంచనాల ప్రకారం 2028లో ప్రపంచ జనాభా 8 బిలియన్లకు చేరవచ్చనే అంచనాలుతలకిందులు కావడం గమనిస్తున్నాం. 2022-50ల మధ్య ప్రపంచవ్యాప్తంగా 61 దేశాల జననాల రేట్లు 1 శాతం లోపుకు తగ్గవచ్చని, 8 దేశాల్లో(ఇండియా, ఈజిప్ట్, కాంగో, ఇథియోపియా, నైజీరియా, పాక్, ఫిలిప్పైన్స్, టాంజానియా) జనాభా క్రమంగా పెరగవచ్చని సూచిస్తున్నారు. జనాభా పెరుగుదలతో పేదరిక నిర్మూలన, ఆకలి చావులు, పోషకాహార లోపం, ప్రజా అనారోగ్యం, నిరక్షరాస్యత లాంటి సవాళ్లను అధిగమించడం కష్టం అవుతున్నట్లు తేలింది. జనాభా పెరుగుదలతో సంబంధం కలిగిన ఆహార అభద్రత, మానవహక్కుల ఉల్లంఘనలు, భూగ్రహ కాలుష్యాలు మానవాళికి పెను సవాళ్లను విసురుతోనే ఉన్నది.

ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా జనాభా పెరుగుదలతో పాటు వాతావరణ సానుకూల మార్పులు, ఆహార భద్రత, మానవ హక్కుల పరిరక్షణ, పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యం, అక్షరాస్యత పెరుగుదల, అసమానతల భూతాన్ని తరిమేయడం, జనాభా నియంత్రణ లాంటి రంగాల్లో మానవాళి సుస్థిర అడుగులు వేయాల్సి ఉంది. అత్యధిక జనాభా కలిగిన దేశంగా అవతరిస్తున్న భారతంలో సగటు మనిషి ఆకలి లేని జీవితాలను గడపాలని కోరుకుందాం.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

ఘనంగా వాశిష్ట గణపతి ముని జయంతి వేడుకలు

హైదరాబాద్ నవంబర్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూస్);తపోస్ నిష్ఠతో గయాన సంపన్నులైన వాశిష్ఠ గణపతి జీవితం భావితరాలకు స్ఫూర్తిదాయకమని ప్రముఖ అంతర్జాతీయ పర్యాటక రచయిత డాక్టర్ నర్మదా అన్నారు. మానస ఆర్ట్ థియేటర్స్ సుమన్ ఆర్ట్ థియేటర్స్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో సికింద్రాబాద్ లోని డిఎస్ నిలయంలో జ్ఞాన తపస్య వాశిష్ఠ గణపతిముని 144వ జయంతి కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ నర్మద గణపతి ముని చిత్రపటానికి పుష్పమాల సమర్పించి జ్యోతి ప్రకాశం గావించారు. ఈ సందర్భంగా డాక్టర్ నర్మదా మాట్లాడుతూ పిన్నవయసు నుండే తప సంపన్నులైన గణపతి ముని ఆధ్యాత్మిక మార్గంలో ఉంటూ తర్క శాస్త్రం, జ్యోతిష్య శాస్త్రం,సాహిత్య పాండిత్య ప్రతిమతో శతాధిక గ్రంథాల రచిం చారని అన్నారు. స్త్రీలకు సమాన స్వే చ్ఛ, అంటరానితనం నిర్మూలన వంటి సేవా కార్యక్రమాలు చేసి తరించారని అన్నారు. ఈ యన రమణ మహర్షికి అత్యంత ప్రియ శిష్యుడు.ఈ కార్యక్ర మంలో సబాధ్యక్షులు దైవజ్ఞశర్మ, సంస్థల నిర్వాహకులు రఘు శ్రీ సుమన్ తదితరులు పాల్గొన్నారు

శాంతి భద్రతల పరిరక్షణలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శం

-హోం శాఖ మంత్రి మహమూద్ అలీ

కుమ్రం భీం -ఆసిఫాబాద్ : నవంబర్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూస్); శాంతి భద్రతల పరిరక్షణలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని హోం శాఖ మంత్రి మహమూద్ అలీ అన్నారు. బుధవారం కుమ్రం భీం- ఆసిఫాబాద్ జిల్లాలో రూ.12.30 కోట్లతో అత్యాధునిక హంగులతో నిర్మించిన 7 నూతన పోలీస్‌స్టేషన్లను అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు. కాగజ్ నగర్ పర్యటనలో భాగంగా రూ. కోటి వ్యయంతో నిర్మించిన కాగజ్ నగర్ రూరల్ పోలీస్ స్టేషన్, రూ. 30 లక్షల వ్యయంతో నిర్మించిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయ భవనాలను ప్రారంభించారు.కాగజ్ నగర్ రూరల్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వాంకిడి పోలీస్ స్టేషన్ , కౌటాల పోలీస్ స్టేషన్ ,పెంచికల్ పేట్ , చింతలవానిపల్లి పోలీస్ స్టేషన్ల శిలఫకాలను ఆవిష్కరించి వర్చువల్ ద్వారా నూతన పోలీస్ స్టేషన్ భవనాలను ప్రారంభించారు. అంతకుముందు హరితహారం కార్యక్రమంలో భాగంగా రూరల్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో మంత్రులు మొక్కలు నాటారు. అనంతరం రూ. కోటి వ్యయంతో నిర్మించిన రెబ్బన పోలీస్ స్టేషన్ నూతన భవనాన్ని మంత్రులు

ప్రారంభించారు. అనంతరం మంత్రులు మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన వెంటనే అభివృద్ధితో పాటు పోలీస్ వ్యవస్థ ఆధునీకరణపై ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారని, ఆయన దిశనిర్దేశంలో రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ నడుం బిగించిందని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడం ద్వారా సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ పోలీసులు కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం పెట్రోలింగ్ వ్యవస్థను పటిష్టపరచడంలో వేలాది పోలీస్ పోస్టులను భర్తీ చేశారని వివరించారు. మంత్రుల వెంట ఎమ్మెల్యేలు కోనేరు కోనప్ప, ఆత్రం సక్కు, డీజీపీ మహేందర్ రెడ్డి, జడ్పీ చైర్ పర్సన్ కోవా లక్ష్మి, పోలీస్ హౌజింగ్ కార్పోరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా, కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ సురేష్ కుమార్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

మహబూబాబాద్, నవంబర్ 17:(నేటినిజం ప్రతినిధి): పెద్ద వంగర మండలంలోని వడ్డేకొత్తపల్లి గ్రామ సర్పంచ్ నెమరుగొమ్ముల ప్రవీణ్ రావు అమెరికాలో ఉన్న సమయంలో గ్రామంలో వివిధ కారణాలతో మరణించిన కుటుంబ సభ్యులను పరామర్శించారు.వారిలో కేశబోయిన భారతమ్మ, బందు కమలమ్మ, కేశబోయిన గట్టుమల్లమ్మ, దంతాలపల్లి యాకమ్మ వీరందరూ ఇటీవల కాలంలో మరణించిన కారణంగా స్థానిక సర్పంచ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు, వీరితోపాటు చేయికి గాయమైన వార్డు సభ్యులు కేశబోయిన సంధ్య యాకన్న ను, కన్ను ఆపరేషన్ అయిన కేశబోయిన కుమారస్వామిని, గొడ్డలి తగిలి కాలుకు గాయమైన మచ్చ లింగయ్య లను పరామర్శించారు,

పరామర్శించిన వారిలో హ్యూమన్ రైట్స్ మండల చైర్మన్ కుమ్మరి రామ్మూర్తి,సర్పంచి వెంట వార్డు సభ్యులు చిలుసాని మల్లేష్, కో ఆప్షన్ సభ్యులు కేశబోయిన మల్లయ్య యాదవ్, నాయకులు ఎర్ర గొర్ల రమేష్, పాక అనిల్ కుమార్, బొల్లు స్వామి చరణ్, తదితరులు ఉన్నారు.

పక్కదారిన పడుతున్న పేదలకు అందవలసిన రేషన్ బియ్యం

సంగారెడ్డి నవంబర్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూస్); : పేదలకు అందవలసిన రేషన్ బియ్యం పక్కదారిన పడుతుంది. కొందరు రేషన్ బియ్యాన్ని సేకరించి ఇతర రాష్ట్రాలకు అధిక ధరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. తాజాగా సంగా రెడ్డి జిల్లా కోహీర్ రైల్వే గేటు సమీపంలో బుధవారం అక్రమంగా రవాణా చేస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు, పౌర సరఫరాల శాఖ అధికారులు పట్టుకున్నారు. అందిన సమాచారం మేరకు అధికారులు వాహనాలను తనిఖీ చేస్తుండగా తాండూర్ నుంచి మహారాష్ట్ర వెళ్తున్న లారీని తనిఖీ చేశారు. లారీలో అక్రమంగా తరలిస్తున్న రెండు వందల క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ బియ్యం ఎక్కడి నుంచి ఎక్కడికి తీసుకెళ్తున్నారు. ఎవరు ఈ పనికి పురామయించారు అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. ప్రాథమికంగా లారీ డ్రైవర్, యజమానిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సురేశ్ తెలిపారు.

లిక్కర్ స్కాం కవితతో సంప్రదింపులు జరపాల్సిన కర్మ బీజేపీకి లేదు-సీఎం కేసీఆర్ పై ఎంపీ అర్వింద్ ఫైర్

హైదరాబాద్ నవంబర్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: సీఎం కేసీఆర్ పై ఎంపీ అర్వింద్ ఫైర్ అయ్యారు. ఎమ్మెల్సీ కవితతో బీజేపీ సంప్రదింపులు జరిపిందన్నకేసీఆర్ వ్యాఖ్యలను ఆయన ఖండించారు. లిక్కర్ స్కాంలో చిక్కుకున్న కవితతో సంప్రదింపులు జరపాల్సిన కర్మ బీజేపీకి పట్టలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేతో కవిత సంప్రదింపులు జరిపిందన్నారు. టీఆర్ఎస్ పేరును బీఆర్ఎస్ గా మార్చే సమయంలో కవితను పిలవలేదన్నారు. కేసీఆర్‌ను బెదిరించటానికే కవిత కాంగ్రెస్‌తో సంప్రదింపులు జరిపినట్లు ఆయన ఆరోపించారు. తెలంగాణలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే టీఆర్ఎస్‌కు 20సీట్లకు మించి రావన్నారు. పార్టీలో పాత నేతలను తాను కలుపుకుపోవటం లేదనేది ప్రచారం మాత్రమేనన్నారు. నియోజకవర్గ ఇంచార్జ్‌ల విషయంలో కొత్త, పాత నేతలను బాలెన్స్ చేశామన్నారు.ల

మహిళల్లో డిజిటల్ నైపుణ్యం మరియు అవగాహన కల్పించడానికి డిజిటల్ శక్తి 4.0ని ప్రారంభించిన ఎన్‌సిడబ్ల్యూ

న్యూఢిల్లీ, నవంబర్ 17:ఇది రిపోర్టింగ్ ఉ రిడ్రెసల్ మెకానిజమ్స్, డేటా గోప్యత మరియు వారి ప్రయోజనాల కోసం సాంకేతికతను ఉపయోగించడంలో మహిళలకు సహాయం చేస్తోంది.

సైబర్‌స్పేస్‌లో మహిళలు మరియు బాలికలకు డిజిటల్ సాధికారత మరియు నైపుణ్యం కల్పించడానికి చేపట్టిన దేశవ్యాప్త కార్యక్రమం డిజిటల్ శక్తి క్యాంపెయిన్ నాల్గవ దశను నేషనల్ కమిషన్ ఫర్ ఉమెన్ (ఎన్‌సిడబ్ల్యూ) నిన్న ప్రారంభించింది. ఆన్‌లైన్‌లో మహిళలు మరియు బాలికలకు సురక్షితమైన విధానాన్ని సృష్టించాలన్న నిబద్ధతకు అనుగుణంగా డిజిటల్ శక్తి 4.0 మహిళలను డిజిటల్ నైపుణ్యం కలిగిన వారిగా చేయడంపై దృష్టి సారించింది. అలాగే ఆన్‌లైన్‌లో ఏదైనా చట్టవిరుద్ధమైన/అనుచితమైన కార్యకలాపాలకు వ్యతిరేకంగా నిలబడేలా చేస్తుంది. సైబర్‌పీస్ ఫౌండేషన్ మరియు మెటా సహకారంతో ఎన్‌సిడబ్ల్యూ దీన్ని ప్రారంభించింది.

ఎన్‌సిడబ్ల్యూ చైర్‌పర్సన్ శ్రీమతి రేఖా శర్మ ప్రేక్షకులను ఉద్దేశించి ప్రసంగిస్తూ దేశవ్యాప్తంగా ప్రతి రంగంలో మహిళల సాధికారత కోసం కమిషన్ చేస్తున్న నిరంతర ప్రయత్నాలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "మహిళలకు సురక్షితమైన సైబర్ ప్రదేశాలను నిర్ధారించడంలో ఈ కొత్త దశ ఒక మైలురాయిగా నిరూపిస్తుంది. డిజిటల్ శక్తి మహిళలు మరియు బాలికల డిజిటల్ భాగస్వామ్యాన్ని వారి ప్రయోజనాలకు అనుగుణంగా మరియు ఆన్‌లైన్‌లో సురక్షితంగా ఉంచుకోవడానికి వారికి శిక్షణ ఇవ్వడం ద్వారా వారి డిజిటల్ భాగస్వామ్యాన్ని వేగవంతం చేస్తోంది. మహిళలు మరియు బాలికలపై సైబర్ హింసకు వ్యతిరేకంగా పోరాడటానికి మరియు ఇంటర్నెట్‌ను వారికి సురక్షితమైన స్థలంగా మార్చే పెద్ద లక్ష్యం కోసం ప్రాజెక్ట్ దోహదపడుతుందని నేను నమ్ముతున్నాను'' అని అభిప్రాయపడ్డారు.

నాల్గవ దశ డిజిటల్ శక్తి ప్రచారాన్ని ప్రారంభించిన సందర్భంగా ఎన్‌సిడబ్ల్యూ చైర్‌పర్సన్ శ్రీమతి రేఖా శర్మఆన్‌లైన్ సమస్యను పరిష్కరించడానికి పరిశ్రమ, ప్రభుత్వం మరియు విద్యావేత్తలు, నిపుణుల నుండి మంచి అభిప్రాయాలను అందించడానికి "సేఫ్ స్పేసెస్ ఆన్‌లైన్ కంబాటింగ్ సైబర్-ఎనేబుల్డ్ హ్యూమన్ ట్రాఫికింగ్ మరియు ఇతర రకాల ఆన్‌లైన్ హింస"పై ఇంటరాక్టివ్ ప్యానెల్ చర్చ కార్యక్రమంలో ప్రారంభించబడింది. అన్ని టాంజెంట్‌ల నుండి మహిళల భద్రత మరియు ఆన్‌లైన్‌లో మెరుగైన మహిళల భద్రతను నిర్ధారించడానికి పూర్తి విధానాన్ని ఇది అందిస్తుంది.

పద్మశ్రీ సునీత కృష్ణన్, జనరల్ సెక్రటరీ, ప్రజ్వల, శ్రీ అశుతోష్ పాండే, సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్, ఎన్‌సిడబ్ల్యూ, పవన్ దుగ్గల్, అడ్వకేట్ సుప్రీం కోర్ట్ ఆఫ్ ఇండియా మరియు సలహాదారు, సిపిఎఫ్, వీరేంద్ర మిశ్రా,ఏఐజీ, ఎన్ఐఎన్ఎఫ్, మధ్యప్రదేశ్ పోలీస్ మరియు సలహాదారు, ఎన్‌సిడబ్ల్యూ, ప్రీతి చౌహాన్ , డైరెక్టర్-ఆపరేషన్స్, సిపిఎఫ్ ఈ చర్చలో పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా మహిళలకు డిజిటల్ ఫ్రంట్‌పై అవగాహన స్థాయిని పెంచడానికి, స్థితిస్థావకతను పెంపొందించడానికి మరియు సైబర్ నేరాలను అత్యంత ప్రభావవంతమైన మార్గాల్లో ఎదుర్కోవడానికి సహాయం చేయడానికి జూన్ 2018లో డిజిటల్ శక్తి ప్రారంభమైంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా భారతదేశం అంతటా 3 లక్షల మందికి పైగా మహిళలకు సైబర్ భద్రత చిట్కాలు మరియు ఉపాయాలు, రిపోర్టింగ్ ఉ రిడ్రెసల్ మెకానిజమ్స్, డేటా గోప్యత మరియు వారి ప్రయోజనాల కోసం సాంకేతికతను ఉపయోగించడం గురించి అవగాహన కల్పించారు.

మూడవ దశ కార్యక్రమం మార్చి 2021లో లెహ్‌లో ఎన్‌సిడబ్ల్యూ చైర్‌పర్సన్ ద్వారా లెఫ్టినెంట్ గవర్నర్ శ్రీ రాధా కృష్ణ మాథుర్ ఉ జమ్యాంగ్ త్సెరింగ్ నమ్‌గ్యాల్, ఎంపీ, లడఖ్ సమక్షంలో ప్రారంభించబడింది. ఒక మహిళ ఏదైనా సైబర్ నేరాన్ని ఎదుర్కొన్న సందర్భంలో నివేదించే అన్ని మార్గాలపై సమాచారాన్ని అందించడానికి ఒక వనరుల కేంద్రం కూడా మూడవ దశలో అభివృద్ధి చేయబడింది.

అంతర్రాష్ట్ర సైబర్ నేరగాడిని అరెస్టు చేసిన ఆంధ్రప్రదేశ్ పోలీసులు

కడప నవంబర్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ఆంధ్రప్రదేశ్ పోలీసులు ఓ అంతర్రాష్ట్ర సైబర్ నేరగాడిని అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి సుమారు రూ. 2.05కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కడప జిల్లా ఎస్పీ అన్బురాజన్ మీడియాకు వివరాలు వెల్లడించారు. లోన్ యాప్ ద్వారా వేధింపులకు పాల్పడుతున్న ఉత్తర ప్రదేశ్‌కు చెందిన అంతర్రాష్ట్ర లోన్ యాప్ కమిషన్ ఏజెంట్ జలాల్ ఖాన్‌ను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.బద్వేల్ ప్రాంతానికి చెందిన మోహన్ అనే బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ జరిపి జలాల్ ఖాన్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా పాల్పడ్డ సైబర్ నేరాలను అంగీకరించారని తెలిపారు. 14 రాష్ట్రాలలో సైబర్ క్రైమ్ నేరాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైందని, అతడి వద్ద ఏడు బ్యాంక్ అకౌంట్‌లను గుర్తించి రూ. 2.05 కోట్ల నగదు సీజ్ చేసినట్లు వెల్లడించారు.మరో ముగ్గురు లోన్ యాప్ నిర్వాహకుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు వివరించారు. సైబర్ క్రైమ్, లోన్‌యాప్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ జిల్లా ప్రజలకు సూచించారు.

తెలంగాణలో జర్మనీ కంపెనీలకు అద్భుతమైన అవకాశాలు

- చెన్నై జర్మనీ కాన్సులేట్‌లోని కౌన్సుల్ జనరల్ మైఖేల్ కుచ్లర్

హైదరాబాద్ నవంబర్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: చెన్నైలో ఉన్న జర్మనీ కాన్సులేట్‌లోని కౌన్సుల్ జనరల్ మైఖేల్ కుచ్లర్ ఇవాళ హైదరాబాద్‌లో పర్యటించారు. తెలంగాణ ఐటీశాఖ మంత్రి కేటీఆర్‌తో ఆమె భేటీ అయ్యారు.

ఈ సందర్భంగా పలు అంశాలపై ఆ ఇద్దరూ చర్చించుకున్నారు. హైదరాబాద్‌కు తొలి సారి విజిట్ చేసిన కౌన్సుల్ జనరల్ మైఖేల్ కుచ్లర్‌కు మంత్రి కేటీఆర్ స్వాగతం పలికారు. తెలంగాణ, జర్మనీ మధ్య ప్రాధాన్యత రంగాల సహకారం గురించి ఇద్దరూ చర్చించుకున్నట్లు మంత్రి కేటీఆర్ తన ట్వీట్‌లో తెలిపారు. ఆవిష్కరణలు, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, స్కిల్ డెవలప్మెంట్ అంశాలపై జర్మనీ కౌన్సుల్ జనరల్‌తో మంత్రి కేటీఆర్ ముచ్చటించారు.తెలంగాణలో జర్మనీ కంపెనీలకు అద్భుతమైన అవకాశాలు ఉన్నట్లు కౌన్సుల్ జనరల్ మైఖేల్ తెలిపారు. చెన్నై కౌన్సులేట్ తన ట్విట్టర్‌లో ఈ విషయాన్ని వెల్లడించింది. దేశంలో అత్యంత నైపుణ్యం కలిగి ఉన్న కార్మికుల్లో తెలంగాణ అయిదో రాష్ట్రంగా నిలుస్తుందని కౌన్సుల్ జనరల్ కీర్తించారు. లైఫ్ సైన్సెస్‌తో పాటు వ్యాక్సిన్ ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రం ప్రత్యేకత సంతరించుకున్నట్లు జర్మనీ కౌన్సులేట్ పేర్కొన్నది. మంత్రి కేటీఆర్‌తో జరిగిన చర్చలు ఫలప్రదం అయినట్లు జర్మనీ కౌన్సుల్ జనరల్ తన ట్వీట్‌లో వెల్లడించారు.

భారత్ గౌరవ్ రైళ్ల పథకం కింద ఎల్‌హెచ్‌బీ బోగీలను మాత్రమే భారతీయ రైల్వేలు ఇకపై కేటాయిస్తాయి

న్యూఢిల్లీ, నవంబర్ 17:మెరుగైన నాణ్యతగల రైలు బోగీలు, ఆకర్షణీయ పర్యాటక ప్యాకేజీలను అందించడం ద్వారా రైలు ఆధారిత పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు భారత్ గౌరవ్ రైళ్ల పథకంలో మార్పులు జరిగాయి.

ఇకపై, భారత్ గౌరవ్ రైళ్ల పథకం కింద లింక్ హాఫ్‌మన్ బుష్ (ఎల్‌హెచ్‌బీ) బోగీలను మాత్రమే కేటాయిస్తారు.

రైలు పర్యాటకానికి ప్రోత్సాహం, ఫలితాల సాధ్యతను దృష్టిలో పెట్టుకుని, ఈ పథకం కింద భారత్ గౌరవ్ రైళ్ల నిర్వహణ కోసం స్థిర, చర రవాణా రుసుముల్లో ఓవర్‌హెడ్ కాంపోనెంట్‌లను విధించకూడదని రైల్వే మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. దీనివల్ల, భారత్ గౌరవ్ రైళ్ల పథకం కింద రైలు పర్యాటకం ప్రోత్సాహానికి భారత రైల్వేల ద్వారా సుమారు 33% రాయితీ దక్కుతుంది.

భారత్ గౌరవ్ రైళ్ల విధానం కింద ఇప్పటికే ఐసీఎఫ్ బోగీల కేటాయింపు పొందిన సేవా ప్రదాతలు, సవరించిన రుసుముల ప్రయోజనం పొందేందుకు ఒప్పందంలో మిగిలిన కాలానికి ఎల్‌హెచ్‌బీ బోగీలకు మారే అవకాశం ఇస్తారు. ఇప్పటికే కేటాయించిన బోగీలనే కొనసాగించాలని వాళ్లు నిర్ణయించుకుంటే, సవరించిన రుసుముల ప్రయోజనం భవిష్యత్తులో అందుబాటులో ఉంటుంది.

'జన్ జాతీయ గౌరవ్ దివస్' సందర్భంగా గిరిజన సమాజాల అభివృద్ధికి తన నిబద్ధతను పునరుద్ఘాటించిన - డి.ఓ.టి.

న్యూఢిల్లీ, నవంబర్ 17:డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ (డి.ఓ.టి) 5.11.2022.న జరుపుకుంటున్న 'జంజాతీయ గౌరవ్ దివస్' సందర్భంగా గిరిజన వర్గాల అభివృద్ధికి తన నిబద్ధతను పునరుద్ఘాటించింది. దేశంలోని గిరిజన జనాభాకు డి.ఓ.టి. టెలికాం కనెక్టివిటీని అందిస్తోంది. గణనీయమైన గిరిజన జనాభా ఉన్న ప్రాంతాల్లో, మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు టెలికాం శాఖ, అనేక పథకాలను అమలు చేస్తోంది. ఆంధ్రప్రదేశ్, బీహార్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశా, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో వామపక్ష తీవ్రవాదం (ఎల్.డబ్ల్యూ.ఈ) మొదటి దశ పథకం కింద 2,343 మొబైల్ టవర్లు ఏర్పాటు చేయడం జరిగింది. కాగా, ఎల్.డబ్ల్యూ.ఈ. రెండో దశ పథకం కింద మరో 2,542 మొబైల్ టవర్లను ఏర్పాటు చేస్తున్నారు.

నిమ్స్ విస్తరణకు రూ. 1,571 కోట్ల నిధుల మంజూరు

హైదరాబాద్ నవంబర్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూస్); : ఈ నేపథ్యంలో నిమ్స్ విస్తరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో నిమ్స్ విస్తరణకు రూ. 1,571 కోట్ల నిధులను కేటాయిస్తూ వైద్యారోగ్య శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. నిమ్స్ విస్తరణ ప్రాజెక్టుకు పరిపాలన అనుమతులను ప్రభుత్వం మంజూరు చేసింది.తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల రోగులకు నిమ్స్ ఆస్పత్రి అత్యుత్తమ వైద్య సేవలందిస్తున్న విషయం విదితమే. ఈ ఆస్పత్రిలో ప్రతి రోజు కొన్ని వేల మంది వైద్యం చేయించుకుంటుంటారు. ఇటు రాష్ట్రంలోని నలుమూలల నుంచే కాకుండా, పొరుగు రాష్ట్రాల కోసం వైద్యానికి వస్తుంటారు. కాగా నిమ్స్ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 1,571 కోట్ల నిధులు కేటాయించడంపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు హరీశ్‌రావు ట్వీట్ చేశారు. ఆరోగ్య తెలంగాణ కోసం తీసుకుంటున్న చర్యల్లో ఈ నిర్ణయం మరో ముందడుగు అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి స్పష్టం చేశారు. ఆరోగ్య రంగాన్ని మరింత బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు.

భారత యువ ప్రొఫెషనల్స్‌కు బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ తీపికబురు

-సరికొత్త వీసా పథకానికి బ్రిటన్ ప్రధాని గ్రీన్‌సిగ్నల్

లండన్ నవంబర్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: భారత యువ ప్రొఫెషనల్స్‌కు బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ తీపికబురు అందించారు. భారత్ నుంచి బ్రిటన్‌లో పనిచేసేందుకు ఏటా 3000 మంది యువ ప్రొఫెషనల్స్‌ను అనుమతించే సరికొత్త వీసా పథకానికి బ్రిటన్ ప్రధాని గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. గత ఏడాది ఇరు దేశాల మధ్య కుదిరిన వలస భాగస్వామ్య ఒప్పందం స్ఫూర్తితో ఈ తరహా పథకం కింద లబ్ధి పొందిన తొలి వీసా-నేషనల్ దేశంగా భారత్ నిలిచిందని బ్రిటన్ పేర్కొంది.ఈరోజు బ్రిటన్-భారత్ యువ ప్రొఫెషనల్స్ స్కీమ్ ఖరారైందని, ఈ స్కీమ్‌లో భాగంగా డిగ్రీ చదివిన 18-30 ఏండ్ల లోపు భారత యువ ప్రొఫెషనల్స్ బ్రిటన్‌కు వచ్చి పనిచేస్తూ రెండేండ్ల పాటు ఇక్కడే ఉండవచ్చని బ్రిటన్ ప్రధాని కార్యాలయం ట్వీట్ చేసింది. ఈ స్కీమ్ ప్రారంభించడం భారత్‌తో ద్వైపాక్షిక బంధంలో మేలి మలుపని తెలిపింది.ఇది ఇరు దేశాల ఆర్థిక వ్యవస్థల బలోపేతానికి దోహదం చేస్తుందని బ్రిటన్ ప్రధాని కార్యాలయం పేర్కొంది. బ్రిటన్ నిర్ణయంతో అత్యంత నైపుణ్యం కలిగిన భారత్ యువత ఇప్పుడు ఇంకా పెద్దసంఖ్యలో బ్రిటన్‌లో అవకాశాలు పొందుతారని బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ ఆకాంక్షించారు. ఇరు దేశాల ఆర్థిక వ్యవస్థలూ, సమాజాలు సుసంపన్నమవుతాయని అన్నారు.

పితంపూర్‌లో ఎం అండ్ ఎం ఫామ్ మెషినరీ ప్లాంట్‌ను ప్రారంభించిన కేంద్ర వ్యవసాయ మంత్రి

న్యూఢిల్లీ, నవంబర్ 17:కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ మంత్రి శ్రీ నరేంద్ర సింగ్ తోమర్ ఈరోజు మధ్యప్రదేశ్‌లోని పితాంపూర్‌లో మహీంద్రా అండ్ మహీంద్రా మొదటి గ్రీన్‌ఫీల్డ్ ఫార్మ్ మెషినరీ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ తోమర్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం నేడు ప్రపంచం మనవైపు ఆశగా చూసే స్థితికి చేరుకుందని అన్నారు. దేశం పూర్తిగా అభివృద్ధి చెందాలంటే సాంకేతికతను పూర్తిగా అందిపుచ్చుకోవాలని అన్నారు.

నేడు ప్రతిచోటా ప్రజలు 'మేక్ ఇన్ ఇండియా' ఉత్పత్తులను కొనియాడుతున్నారని శ్రీ తోమర్ అన్నారు. మనం భారతీయులం అయినందుకు మనకు గర్వకారణం, అయితే మన ఉత్పత్తులు ప్రశంసలు అందుకుంటుంటే దానికి మనం మరింత గర్వించదగిన విషయం అని ఆయన తెలిపారు. మన ప్రధాని పని స్ఫూర్తికి కూడా ఇది అద్దం పడుతుందని శ్రీ తోమర్ అన్నారు. నేడు యాంత్రీకరణ, సాంకేతికత ఎంతో అవసరమన్నారు. దేశం, ప్రపంచ జనాభా నిరంతరం పెరుగుతోంది, వాతావరణ మార్పు సవాలు కూడా మన ముందు ఉంది. మన ఉత్పత్తి-ఉత్పాదకతను పెంచడమే కాకుండా, మానవాళికి అందించే సేవగా దేశీయ, ఇతర దేశాలకు కూడా సరఫరా చేయాలి, దీని కోసం చాలా ఎక్కువ కృషి అవసరం అని కేంద్ర వ్యవసాయ మంత్రి చెప్పారు.

శ్రీ తోమర్ మాట్లాడుతూ, ఒక సమగ్ర దృక్పథంతో ప్రధాన మంత్రి శ్రీ మోదీ పేదల కోసం జన్-ధన్ బ్యాంకు ఖాతాలను తెరిచారని, ఇందులో నేడు రూ. 1.46 లక్షల కోట్లు జమ అయ్యాయని, ఆర్థిక వ్యవస్థకు ఊపునిచ్చిందని అన్నారు. అదేవిధంగా, ప్రధాని మోడీ మరుగుదొడ్లు నిర్మించాలనే ప్రచారాన్ని ప్రారంభించారు, దేశాన్ని ఓడిఎఫ్ రహితంగా ఉండాలన్న సంకల్పం సాకారం అయిందని ఆయన తెలిపారు. కోవిడ్ సంక్షోభం సమయంలో 80 కోట్ల మంది పేదలకు ఉచిత రేషన్ పంపిణీ చేసిన ప్రధాని మోదీ పేద మహిళల ఖాతాల్లో నగదును అందుబాటులో ఉంచారు. దేశ జనాభాలో ఈ సగం మంది అభివృద్ధి చెందకుండా భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే కల నెరవేరదని శ్రీ మోదీ విశ్వసించారు. ప్రధాని మోదీ చేస్తున్న ఈ పనులు చారిత్రాత్మకమైనవి, ఇది చాలా వరకు సానుకూల ప్రభావం చూపుతుంది అని శ్రీ తోమర్ చెప్పారు.

నేడు నాణ్యతను పరీక్షించే ధోరణి పెరుగుతోందని కేంద్ర మంత్రి అన్నారు. దేశంలోనూ, ప్రపంచంలోనూ బ్రాండింగ్, నాణ్యత విశ్వసనీయత పెరుగుతోందని తెలిపారు. వ్యవసాయ పరికరాల దృక్కోణంలో, ఇది మహీంద్రా అండ్ మహీంద్రా చేసిన మొదటి వినూత్న ప్రయోగమని చెప్పారు. ఈ కంపెనీ వ్యవసాయ పరికరాల ఎగుమతి లక్ష్యాన్ని కూడా నిర్దేశించుకుందని, భారతదేశం ప్రపంచ అగ్రగామిగా ఎదగాల్సిన అవసరం నేడు ఉందని శ్రీ తోమర్ అన్నారు. దేశీయ డిమాండ్‌ను తీర్చడమే కాకుండా ప్రపంచానికి సరఫరా చేయడం ద్వారా, భారతదేశం అభివృద్ధి చెందుతుంది, ప్రపంచ గురువుగా దాని ఖ్యాతిని కూడా వ్యాపింప జేస్తుందని ఆయన తెలిపారు. ఉన్నత చదువులు చదివి విదేశాల్లో మంచి ఉద్యోగం చేసినా ఎంతో మంది యువత భారత్‌కు వచ్చి వ్యవసాయం వైపు ఆకర్షితులవుతున్నారని సంతోషం వ్యక్తం చేశారు.

హరితమయంగా మారనున్న హైదరాబాద్ మహా నగరం

-పచ్చదనం, ఆహ్లాదకర వాతావరణం వలన అందరికి అనువైన వాతావరణం

హైదరాబాద్ నవంబర్ 17(ఎక్స్ ప్రెస్ న్యూస్);హైదరాబాద్ నగరానికి మణిహారంగా ఉన్న 158 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్ మొత్తాన్ని అర్బన్ ఫారెస్ట్రీ ఆధ్వర్యంలో పచ్చలహారంగా అభివృద్ధి చేశారు.నగరంలో ఎటుచేసినా పచ్చని చెట్లు, పార్కులతో హైదరాబాద్ నగరం ఆహ్లాదకరంగా కనిపిస్తున్నది.ఓ ఆర్ ఆర్ పైనుంచి వెళ్లే వాహనదారులకి ఒక మంచి అనుబూతిని జ్ఞాపకంగా మిగుల్చుతున్నది. ముఖ్యమంత్రి కె, చంద్రశేఖర్ రావు మానసపుత్రికగా చేపట్టిన తెలంగాణకు హరితహారం అమలులో ముందున్నది.రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కె. తారక రామారావు ఆదేశాలు మేరకు నగరాన్ని అత్యంత నివాసయోగ్య ప్రాంతంగా హైదరాబాద్ అభివృద్ధి చెందుతున్నది. అందులో భాగంగా ప్రతియేటా వివిధ ప్రాజెక్ట్స్ కింద కోట్లాది మొక్కలను నాటించి, సంరక్షిస్తున్నది. స్వంత నర్సరీలు ద్వారా నగరంలోని పలు ప్రాంతాలను లంగ్ స్పేస్ లుగా ఆహ్లాదకరంగా అభివృద్ధి చేస్తున్నది. ఆధ్వర్యంలో 2022-23 సీజన్‌లో రూ.298.09 కోట్లతో తెలంగాణకు హరితహారం కింద 4 కోట్ల 50 లక్షల మొక్కలను నాటారు. పచ్చదనం అభివృద్ధిలో ముందున్నది. 71.15 లక్షల మొక్కలను నాటి ఔటర్ రింగ్ రోడ్ (158 కి.మీ.), ఇంటర్‌ఛేంజీలు (457.23 ఎకరాలు), సర్వీస్ రోడ్, రైల్వే కారిడార్లు మొదలైన వాటితో పాటు ఇంటెన్సివ్ ప్లాంటేషన్ ద్వారా గ్రీన్ కారిడార్ అభివృద్ధి చేసింది.మొక్కలకు నీరందించేందుకు నాఖీఖీలో బిందు సేద్యం పరికరాలు అమర్చారు. బిందు సేద్యం పరికరాలు నాఇజీటజీ సాఫ్ట్‌వేర్ ఆధారిత ఆటోమేషన్‌పై పని చేస్తున్నాయి .ఈ పద్ధతిని పాటించుట వలన నాఖీఖీలో డ్రిప్ ఇరిగేషన్ కు రూ.5.09 కోట్లు ఆదా అవుతున్నది .11,6 కోట్ల 62 లక్షల వ్యయంతో పరిధిలో ఉన్న 14708.24 ఎకరాల విస్తీర్ణంలో (16) ఫారెస్ట్ బ్లాక్‌లలో "అర్బన్ లంగ్ స్పేసెస్"గా గ్రీనరిని,అభివృద్ధి చేస్తున్నది . (16) రిజర్వ్ ఫారెస్ట్ పార్కులలో, ఆరు పార్కులు ఇప్పటికే ప్రజలకు అందుబాటులోకి తేబడినాయి. పరిధిలో జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, ఖీ ఉ ః రోడ్లు ఉ రోడ్ల వెంట సెంట్రల్ మీడియన్ - మల్టీ లేయర్ అవెన్యూ ప్లాంటేషన్లు 672.5 కిమీలు, అవెన్యూ ప్లాంటేషన్లు 269.8 కిమీలు లను అభివృద్ధి చేయడం జరిగింది.. 2022-23 సీజన్‌లో ప్రభుత్వం నిర్దేశించిన విధంగా 5 కోట్ల మొక్కలను 42 నర్సరీలలో పెంచడం జరిగింది. హెచ్ఎండీఏకు చెందిన తెల్లాపూర్ నర్సరీ రాష్ట్రంలోని ఉత్తమ నర్సరీలలో ఒకటిగా గుర్తింపు పొందింది . పరిధిలోని (14) సరస్సులలో గ్రీనరీని అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవడం వలన సేదతీర్చే ఆహ్లాదకర ప్రాంతాలుగా రూపొందాయి. హైదరాబాద్ నగరంలో ఎన్టీఆర్ గార్డెన్, సంజీవయ్య పార్క్, నెక్లెస్ రోడ్‌తో సహా (39) అర్బన్ పార్కులు అర్బన్ లంగ్ స్పేస్‌లుగా అభివృద్ధి చేయబడినాయి. తద్వారా యునైటెడ్ నేషన్స్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ మరియు అర్బోర్ డే ఫౌండేషన్ వారు ట్రీ సిటీ అవార్డు అందించారు. హైదరాబాద్‌కు "ట్రీ సిటీ అవార్డు" రావడం ఇది రెండోసారి. 2020 సంవత్సరానికి 1వ అవార్డ్, 2021 సంవత్సరానికి 2వ అవార్డు లభించింది. పచ్చదనం పెంపుదలకు ప్రభుత్వం చేస్తున్న కృషికి లభించిన పురస్కారమిది.ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా 2021 నివేదిక ప్రకారం దేశంలో ఒక దశాబ్దంలో 48.66 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో అత్యధిక గ్రీన్ కవర్‌ను పొందిన మెగా నగరాల్లో హైదరాబాద్ అగ్రస్థానంలో ఉంది.

2024లో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే దేశం వినాశనమే- సీపీఐ ప్రధాన కార్యదర్శి డీ.రాజా

హైదరాబాద్ నవంబర్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: గుజరాత్ సహా దేశ వ్యాప్తంగా బీజేపీ పట్ల ప్రజల్లో తీవ్రమైన అసంతృప్తి పెరుగుతోందని సీపీఐ ప్రధాన కార్యదర్శి డీ రాజా స్పష్టం చేశారు. దీంతో బీజేపీ నేతల్లో వణుకు, భయం మొదలైందన్నారు. గుజరాత్ ఎన్నికల ప్రచార సభల్లో మోదీ, అమిత్ షా ప్రసంగాలను పరిశీలిస్తే, ఆ నేతల్లో నిరాశ, భయాందోళనలు కనబడుతున్నాయన్నారు. 2024లో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే దేశం వినాశనమవుతుందని రాజా పేర్కొన్నారు.

సీపీఐ జాతీయ కార్యదర్శిగా రెండోసారి ఎన్నికైన తర్వాత డీ రాజా హైదరాబాద్‌కు రావడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తక్కెళ్లపల్లి శ్రీనివాస్ రావు అధ్యక్షతన మగ్దూం భవన్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి డీ రాజా ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. బీజేపీ పట్ల ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి నేపథ్యంలో హిమాచల్ ప్రదేశ్, గుజరాత్ ఎన్నికల ఫలితాలు ఎలా ఉండబోతాయన్నది ఉత్కంఠగా మారిందన్నారు. త్వరలో జరిగే త్రిపుర, నాగాలాండ్ ఎన్నికల ఫలితాలపై దేశమంతా ఆసక్తిగా ఎదురుచూస్తోందన్నారు. బీజేపీ మరోసారి అధికారంలో కొనసాగితే దేశ వినాశనం తప్పదని హెచ్చరించారు. కనిష్ఠ ప్రభుత్వం, గరిష్ఠ పరిపాలన అందిస్తానని తొలిసారి ప్రధాని బాధ్యతలు చేపట్టినప్పుడు నరేంద్ర మోదీ హామీ ఇచ్చారని, అందుకు భిన్నంగా నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తూ నిరంకుశ విధానాలను అమలు పరుస్తున్నారని విమర్శించారు. దేశాన్ని వినాశనం దిశగా తీసుకుపోతున్నారని మండిపడ్డారు. దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని, లౌకిక వ్యవస్థలను పరిరక్షించుకోవాలంటే బీజేపీ, ఆర్ఎస్ఎస్ కలయికను 2024 ఎన్నికల్లో తప్పక ఓడించాలని రాజా పిలుపునిచ్చారు.జాతీయ స్థాయిలో బీజేపీ, ఆర్ఎస్ఎస్, ఫాసిస్టు శక్తులను ఏకాకిని చేసి 2024 ఎన్నికల్లో ఓడించాలని, ఇందుకు వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర పార్టీలు, శక్తులు, ప్రాంతీయ పార్టీల ఐక్యతను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉన్నదని రాజా చెప్పారు. తెలంగాణలో కూడా ఇదే రాజకీయ అవగాహనతో ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. జీవనోపాధి సమస్యలపై ప్రజలను సమీకరించి పోరాటాలు నిర్వహించడం ద్వారా కమ్యూనిస్టు పార్టీని శక్తివంతం చేయాలని పార్టీ శ్రేణులకు రాజా పిలుపునిచ్చారు.

జాతీయ సాంకేతిక వస్త్ర కార్యక్రమం కింద సాంకేతిక వస్త్ర సంబంధ 'ప్రోటెక్'పై జాతీయ సమావేశం

న్యూఢిల్లీ, నవంబర్ 17:ఉత్తర భారత వస్త్ర పరిశోధన సంస్థ (నిట్రా-ఔఎఖీం), భారతీయ సాంకేతిక వస్త్ర పరిశ్రమ సంఘం (ఇట్టా-ఎుం) భాగస్వామ్యంతో కేంద్ర జౌళి మంత్రిత్వశాఖ ఇవాళ ఇక్కడ "నేషనల్ కాంక్లేవ్ ఆన్ టెక్నికల్ టెక్స్ టైల్స్- ప్రోటెక్'' పేరిట ప్రత్యేక సమావేశం నిర్వహించింది. కేంద్ర జౌళి మంత్రిత్వశాఖ కార్యదర్శి శ్రీమతి రచనా షా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దీంతోపాటు రక్షణాత్మక వస్త్ర ఉత్పత్తులు తయారుచేసే వివిధ కంపెనీల విస్తృత శ్రేణి ఉత్పత్తులతో ఒక ప్రదర్శనను కూడా ఆమె ప్రారంభించారు.

ఈ సమావేశంలో భాగంగా భారతదేశంలో రక్షణాత్మక వస్త్ర ఉత్పత్తుల దేశీయీకరణకుగల అవకాశాలు, భారతీయ రక్షణాత్మక వస్త్ర వాడకంపై వినియోగదారుల అనుభవం-అంచనాలు, మార్కెట్ ప్రాచుర్యం కల్పన-ఎగుమతి అవకాశాలు సహా అంతర్జాతీయంగా ఉత్తమాచరణలపై మూడు బృంద గోష్ఠులు నిర్వహించబడ్డాయి. కేంద్ర ప్రభుత్వం అధికారులు- ప్రతినిధుల ంసహా భారత సాయుధ దళాలు, పరిశోధకులు, పారిశ్రామికవేత్తలు, సాంకేతిక వస్త్ర రంగం.. ముఖ్యంగా రక్షణాత్మక వస్త్ర (ప్రోటెక్) వృత్తి నిపుణులు మొత్తం 450 మంది వరకూ ఇందులో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కేంద్ర జౌళి మంత్రిత్వశాఖ కార్యదర్శి శ్రీమతి రచనా షా మాట్లాడుతూ- భారత ఆర్థిక వ్యవస్థతోపాటు భారతీయ ఎగుమతులకు సంబంధించి జౌళి పరిశ్రమ ప్రధాన పాత్ర పోషిస్తున్నదని ప్రముఖంగా ప్రస్తావించారు. సాంకేతిక వస్త్ర రంగాన్ని ఏటా 10 శాతం వృద్ధితో శరవేగంగా ఎదుగుతున్న నవ్య పరిశ్రమగా ఆమె అభివర్ణించారు. ఈ రంగం పరిమాణం రీత్యా ఇంకా శైశవ దశలోనే ఉన్నప్పటికీ, అంతర్జాతీయ వేదికపై ఈ రంగం కీలక పాత్ర పోషించగల అవకాశాలు ఎన్నో ఉన్నాయని పేర్కొన్నారు. సాంకేతిక వస్త్ర రంగంలో చైతన్యం, శక్తి గురించి మాట్లాడుతూ- తయారీ, ఎగుమతులకు భారత్ శక్తిమంతమైన గమ్యస్థానంగా ఆవిర్భవించడానికి సిద్ధంగా ఉందని చెప్పారు. ఏది ఏమైనప్పటికీ ఉత్పాదకతలో వైవిధ్యం, రూపకల్పన, సౌందర్యం వంటివాటిపై దృష్టి సారించడంతోపాటు ఇందులో పాలుపంచుకునే కార్మికశక్తికి శిక్షణ అవసరాన్ని ఆమె నొక్కిచెప్పారు.

సాంకేతిక వస్త్ర ఉత్పత్తుల నాణ్యత ప్రమాణాల పెంపు-అమలుకు సమష్టి కృషి అవసరాన్ని ఆమె ప్రముఖంగా ప్రస్తావించారు. అలాగే అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా నాణ్యమైన ఉత్పత్తుల తయారీ-విక్రయాలకు 'ఎన్‌టీటీఎం' ఆధ్వర్యాన తమ మంత్రిత్వ శాఖ సంయుక్తంగా కృషి చేసిందని వివరించారు. సాంకేతిక వస్త్ర రంగంలో అత్యంత కీలక అనువర్తనాలలో ఒకటి రక్షణాత్మక విభాగంలో ఉందని చెప్పారు. ఇది రక్షణ అవసరాలున్న రంగాల్లో క్రియాత్మక పని సామర్థ్యం మెరుగుకు ఈ ఉత్పత్తులు ఉపయోగపడతాయనని ఆమె తెలిపారు. ఈ 'ప్రోటెక్' ఉత్పత్తులకు అంతర్జాతీయ డిమాండ్‌తోపాటు వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో సాంకేతిక పరిజ్ఞాన దేశీయీకరణ, ప్రోటెక్ ప్రత్యేక వస్తు తయారీలో నాణ్యత ప్రమాణాల అమలుపై దృష్టి కేంద్రీకరించాల్సి ఉందని స్పష్టం చేశారు.

కేంద్ర జౌళి మంత్రిత్వశాఖ కమిషనర్ శ్రీమతి రూవ్ రాశి మాట్లాడుతూ- ఈ రంగంలో ఫలితాల ఆధారిత పరిశోధన-అభివృద్ధిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మేరకు ఎన్‌టీటీఎంలో భాగంగా పరిశోధన-అభివృద్ధిపై మంత్రిత్వ శాఖ అత్యంత శ్రద్ధ చూపుతున్న నేపథ్యంలో రాబోయే సంవత్సరాల్లో అపార వృద్ధి సాధ్యమని అంచనాలున్నట్లు ఆమె పేర్కొన్నారు. రుణమద్దతు, సబ్సిడీ మద్దతు, పెట్టుబడుల ప్రవాహ సౌలభ్యం తదితర అంశాలకు సంబంధించి ఈ రంగంలో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చేస్తున్న కృషి గురించి ఆమె వివరించారు. పారిశ్రామిక విప్లవం 4.0 కు సంబంధించి భారత స్వప్న సాకారంలో సాంకేతిక వస్త్ర పరిశ్రమ ఒక ఉత్ప్రేరకం కాగలదని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ సమావేశంలో భాగంగా భారతీయ సాంకేతిక వస్త్ర మార్కెట్... ప్రత్యేకించి 'ప్రోటెక్' విశిష్టతలను కేంద్ర జౌళి మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి శ్రీ రాజీవ్ సక్సేనా వివరించారు. ఈ మేరకు జాతీయ సాంకేతిక వస్త్ర కార్యక్రమం (ఎన్‌టీటీఎం)లో భాగంగా ఉన్న పరిశోధన-అభివృద్ధి, ఆవిష్కరణలు సహా నైపుణ్యం, శిక్షణ, విద్య, ప్రోత్సాహం, మార్కెట్ విస్తృతి, ఎగుమతులకు ప్రోత్సాహం తదితరాల్లో పురోగమనం గురించి నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమం కింద 'ప్రోటెక్' ప్రత్యేక, ప్యూహాత్మక విభాగాలలో 12 'ప్రోటెక్' ఉత్పత్తులు తదితరాలపై 'క్యూసీవో'' సహా పరిశోధన-అభివృద్ధి దిశగా చేపట్టిన వివిధ చర్యల గురించి వెల్లడించారు. మరోవైపు దేశంలో సాంకేతిక వస్త్ర రంగం వృద్ధికి తోడ్పాటునివ్వడానికి ప్రభుత్వం పలు చర్యలు చేపట్టిందని తెలిపారు. ఈ మేరకు సాంకేతిక వస్త్ర రంగంలో కొత్త కోర్సులు, ప్రయోగశాల మౌలిక సదుపాయాల అభివృద్ధి సహా విద్యా పర్యావరణ వ్యవస్థ రూపకల్పన, నిపుణ కార్మికశక్తిని తయారుచేయడం తదితరాలపై త్వరలో మార్గదర్శకాలను రూపొందిస్తుందని ఆయన పేర్కొన్నారు.

నిట్రా' చైర్మన్ శ్రీ రాజ్ కుమార్ జైన్ మాట్లాడుతూ- సాంకేతిక వస్త్ర మార్కెట్ విస్తరిస్తోందని, వ్యవసాయం, పరిశ్రమలు సహా వివిధ రంగాల్లో రక్షణాత్మక దుస్తులు వినియోగించేవారి సంఖ్య నానాటికీ పెరుగుతోందన్నారు. ఇంకా వినియోగార్హ ఆదాయం పెరుగుదలతో సమీప భవిష్యత్తులో చిన్న కుటుంబాలలోనూ సాంకేతిక వస్త్ర వినియోగం పెరుగుతుందని భావిస్తున్నట్లు చెప్పారు. 'పీఎల్ఐ' పథకం, పీఎం మిత్ర, జాతీయ సాంకేతిక వస్త్ర కార్యక్రమం తదితర సాంకేతిక వస్త్రాభివృద్ధి, పురోగమనం దిశగా అనేక పథకాలను ప్రారంభించడంపై జౌళి మంత్రిత్వ శాఖను ఆయన అభినందించారు. అంతర్జాతీయ మార్కెట్ అవకాశాలను అన్వేషణతోపాటు దేశంలోనూ డిమాండ్‌ను తీర్చడంలో భాగంగా దేశీయ సాంకేతిక వస్త్ర తయారీని కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఆయన చెప్పారు.

'ఇట్టా' చైర్మన్ శ్రీ అమిత్ అగర్వాల్ మాట్లాడుతూ-"క్షణాత్మక వస్త్రాలు కేవలం అగ్నిమాపక దళం నిప్పునార్పే పరిస్థితులలో మాత్రమే కాకుండా శక్తి ప్రసరణ, రేడియేషన్ సంబంధిత అనేక ప్రమాదకర కార్యకలాపాలలో విస్తృతంగా వాడకంలో ఉన్నాయని నొక్కిచెప్పారు. దేశంలోని సంఘటిత, అసంఘటిత రంగాల్లో దాదాపు 10 కోట్లమందికిపైగా ప్రమాదకర పరిసరాలు, పరిస్థితుల నడుమ పనిచేస్తున్నందున రక్షణాత్మక వస్త్రాల వినియోగం విస్తృతం కాగలదని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సాంకేతిక వస్త్ర ఉత్పత్తుల ప్రామాణికత పెంపుపై భారతదేశం దృష్టి సారించాల్సి ఉందని స్పష్టం చేశారు. వినియోగదారు పరిశ్రమలో సాంకేతిక వస్త్ర వినియోగం తప్పనిసరి చేయడం ద్వారా దేశంలో సాంకేతిక వస్త్రాభివృద్ధి గణనీయంగా నమోదు కాగలదని ఆయన పేర్కొన్నారు.

'నిట్రా' డైరెక్టర్ జనరల్ డాక్టర్ అరిందమ్ బసు మాట్లాడుతూ- సాంకేతిక వస్త్రాలు.. ముఖ్యంగా రక్షణాత్మక దుస్తుల రంగంలో ఉత్తర భారత జౌళి పరిశోధన సంస్థ కల్పించిన పరిశోధన సదుపాయాలు, ప్రాజెక్టుల గురించి వివరించారు.

జాబిల్లి వైపు దూసుకెళ్లిన నాసా మూన్ మిషన్ 'ఆర్టెమిస్-1'

న్యూఢిల్లీ, నవంబర్ 17:లండన్ నవంబర్ 16 : అమెరికన్ స్పేస్ ఏజెన్సీ నాసా మూన్ మిషన్ 'ఆర్టెమిస్-1' ఇవాళ ప్రయోగించారు. ఫ్లోరిడాలోని కెన్నెడీ స్పేస్ సెంటర్ నుంచి భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 12.17 గంటలకు రాకెట్ జాబిల్లి వైపు దూసుకెళ్లింది. ప్రయోగించిన కొన్ని నిమిషాల అనంతరం చంద్రుని వైపు ఓరియన్ అంతరిక్ష నౌకను రాకెట్ విడిచిపెట్టింది. సోమవారం నాటికి ఓరియన్ చంద్రుడి ఉపరితలం నుంచి 96.5 కిలోమీటర్లు దాటిపోతుంది. దాదాపు 25 రోజులపాటు అంతరిక్షంలో గడిపిన అనంతరం డిసెంబర్ 11న పసిఫిక్ మహాసముద్రంలో పడనున్నది.ఆర్టెమిస్-1 ప్రయోగం సాంకేతిక లోపాలు, వాతావరణ ప్రతికూలత కారణంగా గతంలో రెండు సార్లు ఆగస్ట్ 29, సెప్టెంబర్ 3న వాయిదా పడింది. మూడోసారి ప్రయోగం సందర్భంగా కూడా కొన్ని అవాంతరాలు తప్పలేదు. అయితే, వాటిని అధిగమించి రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించినట్లు నాసా తెలిపింది. రాకెట్‌లో హైడ్రోజన్ గ్యాస్ లీక్ అవుతుండగా శాస్త్రవేత్తలు సకాలంలో దాన్ని సరిచేశారు. కోర్ స్టేజ్‌లోని లిక్విడ్ హైడ్రోజన్, లిక్విడ్ ఆక్సిజన్ ట్యాంకులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా విజయవంతంగా ఇంధనాన్ని నింపడంతో నాసా శాస్త్రవేత్తలు పిరిపీల్చుకన్నారు.ప్రపంచంలోని అత్యంత శక్తివంతమైన రాకెట్ ఎస్ఎల్ఎస్.. ఓరియన్ స్పేస్ క్యాప్సూల్ కోసం తయారు చేశారు. ఈ రాకెట్‌ను నాసా 1972 లో చంద్రుడిపైకి అపోలో మిషన్‌లో పంపింది. 50 ఏండ్ల తర్వాత నాసా తిరిగి మూన్ మిషన్‌ను ప్రారంభించింది. ఈసారి అంతరిక్ష నౌక ఓరియన్‌ను అంతరిక్షంలోకి తీసుకెళ్లేందుకు నాసా ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన రాకెట్ ఎస్ఎల్ఎస్‌ను తయారు చేసింది.

మలబార్-22 నౌకాదళ విన్యాసాలు



న్యూఢిల్లీ, నవంబర్ 17:బహుళ దేశాల నౌకాదళ విన్యాసాలు 'మలబార్-22' నవంబర్ 15, 2022న జపాన్ సముద్రంలో ముగిసింది. ఇది 26వ దఫా కార్యక్రమంతో పాటు 30వ వార్షికోత్సవం. ఈ విన్యాసాలకు జేఎంఎస్‌డీఎఫ్ అతిథ్యం ఇచ్చింది.

తూర్పు నౌకదళ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ రియర్ అడ్మిరల్ సంజయ్ భల్లా నేతృత్వంలో తూర్పు నౌకాదళానికి చెందిన శివాలిక్, కమోర్త నౌకలు భారత నావికాదళానికి ప్రాతినిధ్యం వహించాయి. భారత్, అమెరికా నౌకాదళాల మధ్య ద్వైపాక్షిక విన్యాసాల రూపంలో మలబార్ పరంపర 1992లో ప్రారంభమైంది. ఆస్ట్రేలియా, జపాన్ కూడా ఈ బృందంలో చేరడంతో విన్యాసాలకు మరింత ప్రాముఖ్యత వచ్చింది.

మలబార్-22 సముద్ర దశ విన్యాసాలు యోకోసుకా సమీపంలో ఐదు రోజుల పాటు జరిగాయి. ఆయుధ కాల్పులు, ఉపరితల, విమాన విధ్వంసక, జలాంతర్గామి విధ్వంసక యుద్ధ విన్యాసాలు, వ్యూహాత్మక విధానాలను ప్రదర్శించారు. 'సముద్రంపై యుద్ధం' కసరత్తు నిర్వహించడం సముద్ర దశలోని మరొక ముఖ్యాంశం. దీనివల్ల నాలుగు నౌకాదళాల సహకార చర్యలను ఏకతాటిపైకి తేవడానికి, వ్యూహా

భారత 41వ అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శనలో సీబీడీటీ పన్ను చెల్లింపుదారుల ప్రాంగణాన్ని ప్రారంభించిన చైర్మన్ శ్రీ నితిన్ గుప్తా

న్యూఢిల్లీ, నవంబర్ 17:న్యూ ఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో 2022 నవంబర్ 14 నుంచి 27దాకా నిర్వహించే భారత 41వ అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శన-2022లో పన్ను చెల్లింపుదారుల ప్రాంగణాన్ని ఆదాయపు పన్ను శాఖ ఏర్పాటు చేసింది. పన్ను చెల్లింపుదారులకు ఆదాయపు పన్ను శాఖ అందించిన సేవలపై అవగాహన కల్పనసహా ఆ శాఖ చేపట్టిన డిజిటలీకరణ, పారదర్శక పన్నువిధానం, ఫిర్యాదులపై ఆన్‌లైన్ పరిష్కారం, ఇ-పాన్, ఇ-ఫైలింగ్ వగైరా నిబంధనల అనుసరణ సౌలభ్య చర్యల గురించి వివరించడం లక్ష్యంగా ఈ ప్రాంగణం ఏర్పాటు చేయబడింది. న్యూఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లోగల 5వ నంబరు హాలులో కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) చైర్మన్ శ్రీ నితిన్ గుప్తా ఈ పన్ను చెల్లింపుదారుల ప్రాంగణాన్ని ప్రారంభించారు. బోర్డు సభ్యులతోపాటు ఆదాయపు పన్ను శాఖలోని పలువురు సీనియర్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సీబీడీటీ ఇటీవల చేపట్టిన పన్ను చెల్లింపుదారు సౌలభ్య చర్యలపై అవగాహన కల్పించడం ప్రధాన లక్ష్యంగా ఈ ప్రాంగణం ఏర్పాటు చేయబడింది. దీంతోపాటు దేశ నిర్మాణంలో పన్నుల ప్రాముఖ్యంపై (భవిష్యత్తు పన్ను చెల్లింపుదారులైన) బాలలు, యువకులలో చైతన్యం కల్పించేందుకు యత్నిస్తుంది. ఈ రెండు కీలక లక్ష్యాల ప్రాతిపదికన ఈ పన్ను చెల్లింపుదారుల ప్రాంగణంలో అధికారులు కింద పేర్కొన్న విధంగా పలు కార్యకలాపాలు నిర్వహించారు:

కామిక్ పుస్తకాలు, బోర్డ్-వర్చువల్ రియాలిటీ ఆటలు, రోబో-టాక్స్, 'ఆయకర్' వీడియో గేమ్ తదితర అంశాలతో కూడిన పిల్లల కార్నివాల్ కేంద్రం. ఆదాయపు పన్నుశాఖకు ముద్రాపక హక్కుగల మూడు కామిక్ పాత్రలు- 'జాన్‌కారీ బాబు', ' 'టాక్స్ పరి', 'టాక్సా'లతో పిల్లలు సంభాషించే వెసులుబాటు.

పన్ను వ్యవస్థ, దేశ నిర్మాణం ఇతివృత్తాలుగా పిల్లలకు నుక్కడ్ నాటక్, క్విజ్ షోలు, ఇంద్రజాల ప్రదర్శనలు, అక్కడికక్కడ కేరికేచర్ గీయడం, డ్రాయింగ్/పెయింటింగ్ పోటీ వగైరాల నిర్వహణ.

ఐఐటీఎఫ్ ఇతివృత్తం 'స్థానికత కోసం స్వగళం'కు అనుగుణంగా అంకుర సంస్థలు, వ్యవసాయం-అనుబంధ కార్యకలాపాలు, స్థానిక తయారీ, సహకార సంస్థలు తదితరాలకు కల్పించిన పన్ను ప్రోత్సాహకాల గురించి వివిధ ప్రదర్శనలు, పరస్పర చర్యాధారిత ప్రదర్శనల ద్వారా ఈ ప్రాంగణం ప్రముఖంగా వివరించింది. పన్ను చెల్లింపుదారులు/భాగస్వాములతో పరస్పర చర్యలుసహా వారికి ఎదురయ్యే సమస్యలపై అభిప్రాయ సేకరణలోనూ ఈ ప్రాంగణం ఒక మాధ్యమంగా ఉపయోగపడుతుంది. అందువల్ల అందరికీ చేరువయ్యే ఒక మార్గంగా మాత్రమేగాక సేవా ప్రదాతగా ఆదాయపు పన్నుశాఖ పోషించే పాత్రను వివరించేందుకు ఈ ప్రాంగణం ఒక వేదికగా నిలుస్తుంది.

పశుసంవర్ధక డెయిరీ శాఖ ప్రధానమంత్రి గతి శక్తి-నేషనల్ మాస్టర్ ప్లాన్‌తో డిపార్ట్‌మెంట్ మౌలిక సదుపాయాలు

న్యూఢిల్లీ, నవంబర్ 17:డీఏహెచ్డీ దేశంలోని వివిధ ప్రదేశాలలో ఉన్న పీఎం గతి శక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్‌తో 12 జాతి అభివృద్ధి సంస్థలను (7 సెంట్రల్ క్యాటిల్ బ్రీడింగ్ ఫామ్‌లు, 4 సెంట్రల్ హెర్డ్ రిజిస్ట్రేషన్ స్కీమ్ సెంట్రల్ ఫ్రోజెన్ సెమెన్ ప్రొడక్షన్ ఉ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్) అనుసంధానిస్తుంది. ఇది మౌలిక సదుపాయాల చివరి మైలు కనెక్టివిటీని సులభతరం చేస్తుంది. ప్రయాణ సమయాన్ని కూడా తగ్గిస్తుంది.

పశుసంవర్ధక పాడి పరిశ్రమ శాఖ వివిధ మౌలిక సదుపాయాలను పీఎం గతి శక్తి-నేషనల్ మాస్టర్ ప్లాన్ (ఎన్ఎంపీ)తో అనుసంధానం చేసే ప్రక్రియను ప్రారంభించింది. మొదటి దశలో పశుసంవర్ధక పాడిపరిశ్రమ శాఖ తన 12 జాతి అభివృద్ధి సంస్థలను (7 కేంద్ర పశువుల పెంపకం ఫారాలు, 4 సెంట్రల్ హెర్డ్ రిజిస్ట్రేషన్ స్కీమ్ సెంట్రల్ ఫ్రోజెన్ సెమెన్ ప్రొడక్షన్ ఉ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్)ను పీఎం గతి శక్తి నేషనల్‌తో కలిసి దేశంలోని వివిధ ప్రదేశాలలో ఏర్పాటు చేసింది. సమగ్ర ప్రణాళిక మౌలిక సదుపాయాల కనెక్టివిటీ ప్రాజెక్టుల సమన్వయం, అమలు కోసం రైల్వేలు రోడ్డు మార్గాలతో సహా 16 మంత్రిత్వ శాఖలను ఒకచోట చేర్చడానికి ఒక డిజిటల్ ప్లాట్‌ఫారమ్ మాస్టర్ ప్లాన్ను తయారు చేసింది. ఈ బహుళ-మోడల్ కనెక్టివిటీ ప్రజలు, వస్తువులు సేవలను ఒక రవాణా విధానం నుండి మరొకదానికి తరలించడానికి ఇంటిగ్రేటెడ్ అతుకులు లేని కనెక్టివిటీని అందిస్తుంది. ఇది మౌలిక సదుపాయాల చివరి మైలు కనెక్టివిటీని సులభతరం చేస్తుంది ప్రయాణ సమయాన్ని కూడా తగ్గిస్తుంది.

ప్రధానమంత్రి గతి శక్తి ఎన్ఎంపీతో ప్రాంతీయ పశుగ్రాసం స్టేషన్లు (ఆర్ఎఫ్ఎస్), సెంట్రల్ పౌల్ట్రీ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్స్ (సీపీడీఓ) మొదలైన ఇతర సంస్థల ఏకీకరణ పురోగతిలో ఉంది. భవిష్యత్తులో ఈ డిపార్ట్‌మెంట్ అన్ని వెటర్నరీ డిస్పెన్సరీలు, మిల్క్ ప్రాసెసింగ్ ప్లాంట్లు, శీతలీకరణ కేంద్రాలు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ఈ శాఖ వివిధ పథకాల కింద పీఎం గతి శక్తి ఎన్ఎంపీ డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌తో అనుసంధానించడానికి ప్రణాళిక చేస్తోంది. ఈ దశ దేశంలోని పశు సంవర్ధక డెయిరీ రంగంలో అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలు కల్పిస్తుంది.

వ్యవసాయం అనుబంధ రంగమైన జీవీఏలో మూడింట ఒక వంతు 8% కంటే ఎక్కువ సీఏజీఆర్ కలిగి ఉన్న పశుసంపద రంగం నేడు భారత ఆర్థిక వ్యవస్థకు కీలకమైనది. అదే సమయంలో, పశు సంవర్ధక, పాడి పరిశ్రమ మత్స్య కార్యకలాపాలు రైతు ఆదాయాన్ని ఉత్పత్తి చేయడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి, ముఖ్యంగా భూమిలేని, చిన్న సన్నకారు రైతులు మహిళల్లో, లక్షలాది మందికి చౌకగా పోషకమైన ఆహారాన్ని అందిస్తాయి.

మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి సీఎం కేసీఆర్ పెద్దపీట : ఎమ్మెల్యే ఆరూరి

వరంగల్, నవంబర్ 17:దేశంలో ఎక్కడా లేని విధంగా మత్స్యకారుల ఆర్థిక పురోగతి కోసం తెలంగాణ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని వర్ధన్నపేట ఎమ్మెల్యే ఆరూరి రమేష్ తెలిపారు. పర్వతగిరి మండలం ఏనుగల్లు గ్రామ చెరువులో ప్రభుత్వం 100 శాతం సబ్సిడీతో అందిస్తున్న 1 లక్షా 35 వేల చేప పిల్లలను ఎమ్మెల్యే ఆరూరి రమేష్ వదిలారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేష్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో మత్స్యకారులకు వంద శాతం సబ్సిడీతో చేపల పంపిణీ కార్యక్రమం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా మత్స్యకారుల కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం అవుతున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నదని తెలిపారు. గొల్ల, కురుమలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు గొర్రెలను పంపిణీ చేసిన ప్రభుత్వం మత్స్యకారుల కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు చేపల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నదని తెలిపారు. మత్స్యకారులకు టీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తి భరోసాను కల్పించిందని, చేపల పెంపకాన్ని వదిలి ఏదో ఒక కూలీ పని చేస్తూ బతుకునీడుస్తున్న మత్స్యకారుల కుటుంబాల్లో సీఎం కేసీఆర్ తిరిగి వెలుగులు నింపారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అలరించడానికి సిద్ధమవుతున్న భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం



న్యూఢిల్లీ, నవంబర్ 17:గొప్ప సినిమా చరిత్ర కలిగి, చలన చిత్ర నిర్మాణంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన అర్జెంటీనా దేశంలో రూపు దిద్దుకున్న 7 చలన చిత్రాలు భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో ప్రదర్శనకు సిద్ధమవుతున్నాయి. చలన చిత్రాలు తమ దేశ ప్రజలు వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తాయని అర్జెంటీనా ప్రజలు భావిస్తారు. చలన చిత్ర రంగంలో అర్జెంటీనా దేశానికి ఘనమైన చరిత్ర ఉంది. 1896లో లూమియర్ సినిమాటోగ్రఫీని ప్యారిస్‌లో ప్రారంభించారు. ప్రారంభించిన ఒక సంవత్సరం తర్వాత లూమియర్ సినిమాటోగ్రఫీని దిగుమతి చేసుకున్న మొదటి దేశాల్లో అర్జెంటీనా ఒకటి. ప్రపంచంలోనే మొట్టమొదటి యానిమేషన్ చలనచిత్రం ఎల్ అపోస్టోల్ కూడా అర్జెంటీనాలో నిర్మాణం అయ్యింది. లుక్రేసియా మార్టెల్, మార్టిన్ రెజ్జ్‌మాన్ మరియు పాబ్లో ట్రాపెరో వంటి వారి నేతృత్వంలో ఆధునిక అర్జెంటీనా సినిమా రంగం ప్రపంచ ఖ్యాతి సాధించింది. గొప్ప సినిమా సంప్రదాయం ఉన్న అర్జెంటీనా దేశంలో నిర్మాణం అయిన చిత్రాల్లో ఎంపిక చేసిన 7 చిత్రాలు 53 వ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో ప్రదర్శించబడతాయి.

రోడ్రిగో గెరెరో దర్శకత్వం వహించిన ' సెవెన్ డాగ్స్' చిత్ర నిర్మాణం 2021లో జరిగింది. అంతర్జాతీయ పోటీ విభాగంలో ప్రముఖ గోల్డెన్ పీకాక్‌కు అవార్డుకు ' సెవెన్ డాగ్స్' నామినేట్ చేయబడింది. అర్జెంటీనా దర్శకుడు దర్శకత్వం వహించిన నాలుగో సినిమా ' సెవెన్ డాగ్స్' . కేవలం 80 నిమిషాల నిడివి గల ' సెవెన్ డాగ్స్' చిత్రం మనిషి మరియు అతని పెంపుడు జంతువుల మధ్య బంధాన్ని చూపిస్తుంది.

'సెల్ఫ్ డిఫెన్స్' చిత్రానికి ఆండ్రియా బ్రాగా దర్శకత్వం వహించారు. చిత్రం ఉత్తమ తొలి దర్శకుడిగా అవార్డు రేసులో 'సెల్ఫ్ డిఫెన్స్' ఉంది. ఒక ప్రాసిక్యూటర్ తన గతానికి సంబంధించిన వరుస హత్యల కేసులను పరిష్కరించడానికి తన స్వగ్రామానికి తిరిగి వచ్చిన సంఘటన ఆధారంగా సినిమా కథ రూపుదిద్దుకుంది.

అర్జెంటీనాలో నిర్మాణం అయిన కి మిస్ వైబోర్గ్ (2022), ది బార్డర్స్ ఆఫ్ టైమ్ (2021), ది సబ్‌స్టిట్యూట్ (2022), రోబ్ ఆఫ్ జెమ్స్ (2022) మరియు ఈమి (2022) చలన చిత్రోత్సవంలో ప్రదర్శించబడతాయి.

ఎక్కువ మందికి అర్జెంటీనా ఫుట్‌బాల్ ప్రముఖులు గురించి మాత్రమే తెలుసు. కానీ నవంబర్ 2022 లో గోవాలో అర్జెంటీనా సినిమా గొప్పదనాన్ని, అద్భుతాన్ని ప్రతి ఒక్కరూ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో ఆస్వాదించవచ్చు.

1952లో ప్రారంభమైన భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం (ఐఎఫ్ఎఫ్ఐ) ఆసియాలోని ప్రముఖ చలన చిత్రోత్సవాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. సినిమా, కథలు మరియు వాటి వెనుక ఉన్న వ్యక్తులకు గుర్తింపు తేవడం లక్ష్యంగా భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం జరుగుతోంది. . చలనచిత్రాల పట్ల అభిమానం,ప్రేమ, జ్ఞానోదయమైన ప్రశంసలు పెంపొందించడానికి, ప్రోత్సహించడానికి ,ప్రచారం చేయడానికి భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం ప్రయత్నిస్తుంది. ప్రజల మధ్య ప్రేమ, అవగాహన మరియు సౌభ్రాతృత్వ సంబంధాలు అభివృద్ధి చేసి వ్యక్తులు, సమాజం నూతన శిఖరాలు చేరేలా ప్రోత్సహించడానికి భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం కృషి చేస్తుంది.

కేంద్ర సమాచార మరియు ప్రసార మంత్రిత్వ శాఖ ప్రతి ఏటా నిర్వహిస్తున్న భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలకు గోవా ప్రభుత్వం ఆతిథ్యం ఇస్తుంది. గోవాలోని ఎంటర్‌టైన్‌మెంట్ సొసైటీ సహకారంతో ప్రతి సంవత్సరం భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం జరుగుతుంది. 53వ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం కి సంబంధించిన తాజా సమాచారాన్ని ఉత్సవాల కోసం ప్రత్యేకంగా సిద్ధం చేసిన వెబ్‌సైట్ లిలిలి.తిటటతిణనీజీ.నీతీణ లో, పిఐబి వెబ్‌సైట్ (జూతిఎ.ణనీల.తిని), ట్విట్టర్,పేస్ బుక్ మరియు ఇంస్టాగ్రామ్ లో సోషల్ మీడియా ఖాతా, మరియు పిఐబి గోవా సోషల్ మీడియా హ్యాండిల్స్‌లో ద్వారా పొందవచ్చు.

ఉత్తరాఖండ్‌లో ప్రారంభం కానున్న భారత్-అమెరికా సంయుక్త శిక్షణ విన్యాసాలు "యుద్ధ్ అభ్యాస్ 2022"

న్యూఢిల్లీ, నవంబర్ 17:18వ దఫా భారత్-అమెరికా సంయుక్త శిక్షణ విన్యాసాలు "యుద్ధ్ అభ్యాస్ 22" ఈ నెలలో ఉత్తరాఖండ్‌లో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం ఏటా జరుగుతుంది. రెండు దేశాల సైన్యాల మధ్య అత్యుత్తమ పద్ధతులు, వ్యూహాలు, సాంకేతికతలు, విధానాలను పరస్పరం మార్చుకునే లక్ష్యంతో ''యుద్ధ్ అభ్యాస్'' చేపడుతున్నారు. 2021 అక్టోబర్‌లో, అలస్కాలోని ఎల్మెండోర్ఫ్ రిచర్డ్‌సన్ జాయింట్ బేస్‌లో గత దఫా విన్యాసాలు జరిగాయి.

11వ ఎయిర్‌బోర్న్ డివిజన్‌లోని 2వ బ్రిగేడ్‌కు చెందిన అమెరికా సైనికులు, అస్సాం రెజిమెంట్‌కు చెందిన భారత సైనికులు ఈ విన్యాసాల్లో పాల్గొంటారు. ఐక్యరాజ్య సమితి నిర్దేశించిన 7వ అధ్యాయం ప్రకారం శిక్షణ కార్యక్రమం జరుగుతుంది. శాంతి పరిరక్షణ, అమలుకు సంబంధించిన అన్ని కార్యకలాపాలు ఈ కార్యక్రమంలో ఉంటాయి. ఉమ్మడి లక్ష్యాలను సాధించేందుకు రెండు దేశాల సైనికులు కలిసి పని చేస్తారు. మానవత సాయం, విపత్తు ఉపశమన (హెచ్ఏఆర్‌డీ) కార్యకలాపాలు కూడా ఈ శిక్షణలో భాగం. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు తక్షణం స్పందించి, వెంటనే సహాయక చర్యలను చేపట్టే శిక్షణలో రెండు దేశాల సైనిక దళాలు పాల్గొంటాయి.

రెండు దేశాల సైన్యాల వృత్తిపర నైపుణ్యాలు, అనుభవాలు నుంచి పూర్తి ప్రయోజనం పొందేలా ఎంచుకున్న అంశాల మీద శిక్షణ విన్యాసాలు, నిపుణుల చర్చలు (ఈఏడీ) ఉంటాయి. సమీకృత యుద్ధ దళాల గుర్తింపు, నిఘా వ్యవస్థల ఏర్పాటు ఉ పనితీరు, రవాణా, పర్వత యుద్ధ నైపుణ్యాలు, క్షతగాత్రుల తరలింపు, కఠిన భూ భాగాలు ఉ పరిస్థితుల్లో యుద్ధ వైద్య సహాయం వంటివి క్షేత్ర స్థాయి శిక్షణ కార్యక్రమంలో ఉన్నాయి. యుద్ధ ఇంజినీరింగ్, యూఎస్ఏ ప్రతిదాడి వ్యూహాలు, సమాచార కార్యకలాపాలు సహా పోరాట నైపుణ్యాల మార్పిడి, విన్యాసాలు ఈ కార్యక్రమంలో ఉంటాయి.రెండు సైన్యాలు తమ విస్తృత అనుభవాలు, నైపుణ్యాలను పంచుకోవడానికి, సమాచార మార్పిడి ద్వారా వారి సాంకేతికతను మెరుగుపరచుకోవడానికి ఈ శిక్షణ కార్యక్రమం దోహదపడుతుంది.

లీడ్ ఐటి సమ్మిట్ స్టేట్ మెంట్ - 2022 ను ఈజిప్టులోని షర్మ్ ఎల్ షేక్, కాప్27లో సంయుక్తంగా నిర్వహించిన భారత్,

న్యూఢిల్లీ, నవంబర్ 17:భారతదేశం, స్వీడన్ ఈరోజు, వాతావరణ మార్పులపై సదస్సు - అూఖ27 పరిధిలో లీడ్ఐటి కార్యక్రమాన్ని నిర్వహించాయి. లీడ్ఐటి (లీడర్‌షిప్ ఫర్ ఇండస్ట్రీ ట్రాన్సిషన్) ప్రయత్నం పారిశ్రామిక రంగాన్ని పరిధిలో ఉంచడానికి కష్టతరమైన తక్కువ కార్బన్ మార్పుపై దృష్టి పెడుతుంది. ఈ కార్యక్రమంలో భారత పర్యావరణ, అటవీ వాతావరణ మార్పుల మంత్రి శ్రీ భూపేందర్ యాదవ్, స్వీడన్ దేశ వాతావరణ పర్యావరణ మంత్రి, రోమినా పూర్మోఖ్తరి ఈజిప్టు అంతర్జాతీయ సహకార మంత్రి శ్రీమతి రైనా అల్-మషత్ పాల్గొన్నారు.

తక్కువ కార్బన్ పరివర్తనకు సహ-అభివృద్ధి ఏకైక మార్గమని శ్రీ భూపేందర్ యాదవ్ పేర్కొన్నారు

ప్రారంభోపన్యాసం సందర్భంగా మంత్రి శ్రీ భూపేందర్ యాదవ్ భారతదేశంలో సిమెంట్, ఉక్కు రంగాలకి సంబంధించి చేపట్టిన కార్యాచరణ కసరత్తు పై ప్రత్యేక దృష్టి సారించి లీడ్ఐటి కార్యకలాపాల గురించి మాట్లాడారు. మున్ముందు, లీడ్ఐటిలోని ఇతర సభ్య దేశాలలో కూడా ఇలాంటి కసరత్తులు చేపట్టాలని భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రపంచం తనకు తానుగా తీసుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి సహ-అభివృద్ధి మాత్రమే ఏకైక ఎంపిక అని, అది లేకుండా, తక్కువ కార్బన్ పరివర్తన సాకారం కావడం దశాబ్దాల ఆలస్యం కావచ్చని కూడా ఆయన నొక్కి చెప్పారు.

"పారిశ్రామిక రంగం తక్కువ కార్బన్ పరివర్తన అవసరమైన వాయు ఉద్గారాల తగ్గింపుకు మాత్రమే దోహదపడదు. ఇది వాతావరణంలో మార్పుల పునరుద్ధరణను పెంచడం, మెరుగైన ఇంధన భద్రత, ఆవిష్కరణలు, సామాజిక-ఆర్థిక అభివృద్ధి ఉద్యోగ కల్పన వంటి అనేక సహ-ప్రయోజనాలను కలిగి ఉంది", అని శ్రీ భూపేందర్ యాదవ్ అన్నారు.

లీడ్ఐటి ప్రస్తుత దశ 2023లో ముగియనుందని, వచ్చే ఏడాది ఇప్పటి వరకు సాధించిన పనితీరు విజయాలను ప్రతిబింబించే సమయం అని కూడా ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. అలాగే, సంప్రదింపుల పద్ధతిలో ప్రాధాన్యతలను గుర్తించేందుకు 2023 తర్వాత ప్రక్రియను కొనసాగించడం పై చర్చించాల్సిన అవసరం ఉంది.

ఈ కార్యక్రమంలో ఆర్థిక ,అంతర్విభాగ సమస్యలపై దృష్టి సారించే సమగ్రచర్చలు ఉన్నాయి. కంపెనీలను కలిగి ఉన్న లీడ్ఐటి సభ్య దేశాలు, పరిశ్రమ రంగంలో తమ విజయవంతమైన ప్రయత్నాలను, తక్కువ-కార్బన్ పరివర్తనల అవసరాలపై అభిప్రాయాలను పంచుకున్నాయి.

లీడ్ఐటి సభ్యులు సమ్మిట్ స్టేట్‌మెంట్‌ను ఆమోదించడంతో సదస్సు ముగిసింది, ఇది పరిశ్రమ తక్కువ-కార్బన్ పరివర్తనను కొనసాగించాలనే నిబద్ధతను పరిశ్రమలకు నొక్కి చెప్పింది. కొత్త సభ్యులు అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలకు సాంకేతిక సహాయం అందించడానికి సభ్యదేశాలు కట్టుబడి ఉన్నాయి. అభివృద్ధి చెందుతున్న అభివృద్ధి చెందుతున్న దేశాలలో భారీ పరిశ్రమల పరివర్తనలో డి-రిస్క్ పెట్టుబడుల ప్రాముఖ్యత కూడా ఈ సదస్సులో ఎత్తి చూపారు.

సదస్సు తర్వాత ఇండియా ప్రాగణంలో లీడ్ఐటి సమ్మిట్ స్టేట్‌మెంట్ 2022 బహిరంగంగా ప్రారంభించారు. పబ్లిక్ లాంచ్‌లో ప్రభుత్వ ప్రతినిధులు, పరిశ్రమలు, మీడియా పౌర సమాజం సహా అనేక మంది పాల్గొన్నారు.

లీడర్‌షిప్ గ్రూప్ ఫర్ ఇండస్ట్రీ ట్రాన్సిషన్ (లీడ్ఐటి) పారిస్ ఒప్పందాన్ని సాధించడానికి అవసరమయ్యే చర్యకు కట్టుబడి ఉన్న దేశాల కంపెనీలు సేకరిస్తుంది. ఇది సెప్టెంబరు 2019లో జరిగిన అమెరికా క్లైమేట్ యాక్షన్ సమ్మిట్‌లో స్వీడన్ భారతదేశ ప్రభుత్వాలచే ప్రారంభమైంది. దీనికి ప్రపంచ ఆర్థిక వేదిక మద్దతు ఉంది. లీడ్ఐటి సభ్యులు నికర-సున్నా కార్బన్ ఉద్గారాలను సాధించే లక్ష్యంతో తక్కువ శక్తితో నడిచే ఇంటెన్సివ్ పరిశ్రమల, దేశాలకి చెందిన కార్బన్ ఉద్గారాల నాణ్యత విషయంలో పురోగమించేందుకు సహకరిస్తున్నారు.

చంద్రబాబుకు మంత్రి బొత్స కౌంటర్ ..

న్యూఢిల్లీ, నవంబర్ 17:తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలకు మంత్రి బొత్స సత్యనారాయణ కౌంటర్ ఇచ్చారు. తనకు ఇవే చివరి ఎన్నికలన్న చంద్రబాబు వ్యాఖ్యలు వాస్తవమని చెప్పారు.

రాష్ట్రంలో వర్షాలు పడాలన్నా.. అభివృద్ధి జరగాలన్నా చంద్రబాబు రాకూడదని తెలిపారు. దేవుడి దయతో గతంలో చంద్రబాబుకు సీఎం పదవి వచ్చిందన్నారు. తనను అవమానించారని చంద్రబాబే అనుకుంటున్నారని పేర్కొన్నారు.

కానీ ఆయనను ఎవరూ అవమానించలేదని వెల్లడించారు. చంద్రబాబు సానుభూతి కోసమే అలా మాట్లాడుతున్నారని విమర్శించారు. అనంతరం చంద్రబాబు ఏం మాట్లాడినా తమకు ఆశీస్సులేనన్నారు. ప్రజలే తమకు న్యాయనిర్ణేతలని.. చంద్రబాబు కాదని మంత్రి బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు.

ఏకాగ్రతతో అమ్మవారి నామస్మరణ చేస్తే దోషాలు తొలగుతాయి : వేలూరు పీఠాధిపతి నారాయణి

తిరుపతి, నవంబర్ 17:: భక్తి శ్రద్ధలతో ఏకాగ్రతతో అమ్మవారిని ప్రతిరోజు నామస్మరణ చేస్తే దోషాలు తొలగిపోతాయి వేలూరు పీఠాధిపతి శ్రీ నారాయణి అమ్మ వారు అన్నారు. తమిళనాడు రాష్ట్రం వేలూరు స్వర్ణ దేవాలయం ట్రస్ట్ వ్యవస్థాపకులు, ఏలూరు పీఠాధిపతి నారాయణి అమ్మ వారికి ఏర్పేడు మండలం ఉకృత మాల లోని సంతాన సంపద వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద గురువారం ధర్మకర్త డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ తో పాటు కుటుంబ సభ్యులు స్వామివారికి మేళతాళాలతో ఘనంగా స్వాగతం పలికారు. పీఠాధిపతి నారాయణి అమ్మ వారు సంతాన సంపద వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వేలూరు స్వర్ణ దేవాలయం ట్రస్టు, వేలూరు పీఠాధిపతి నారాయణి అమ్మవారు మాట్లాడుతూ భక్తి శ్రద్ధలతో ఏకాగ్రతతో అమ్మవారిని ప్రతిరోజు నామస్మరణ చేస్తే దోషాలు తొలగిపోతాయి అన్నారు. ప్రతి రోజు ప్రతి ఒక్కరూ దేవుడిని పూజించాలని, అప్పుడే ఆ కుటుంబానికి వారికి శుభాలు కలుగుతాయని చెప్పారు. ఈ సందర్భంగా వికృతం మాల గ్రామ పరిసర ప్రాంతాల్లోని భక్తులు ప్రజలు వేలూరు పీఠాధిపతి నారాయణి అమ్మవారి ఆశీస్సులను పొందారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ తో పాటు వారి కుటుంబ సభ్యులు పసుపులేటి శివప్రసాద్ పసుపులేటి వెంకటేశ్వర ప్రసాద్ వారి కుటుంబ సభ్యులు గ్రామ మాజీ సర్పంచ్ ప్రజలు పాల్గొన్నారు.

టీటీడీ స్థానికాలయాల్లో వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై సమీక్ష

తిరుపతి, నవంబర్ 17::టీటీడీ స్థానికాలయాల్లో జనవరి 2న ఏకాదశి పర్వదినం ఏర్పాట్లపై జెఈవో శ్రీ వీరబ్రహ్మం పలు విభాగాల అధికారులతో బుధవారం వర్చువల్ విధానంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జెఈవో మాట్లాడుతూ.. ఆయా ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించాలని, ఆగమ పండితులు సూచించిన మేరకు ఖచ్చితమైన వేళలు పాటించాలని కోరారు. ఆలయాలను పుష్పాలు, విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించాలన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా క్యూలైన్లు ఇతర ఇంజినీరింగ్ ఏర్పాట్లు, మెరుగైన పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని కోరారు. అన్న ప్రసాదాలు, తాగునీటి వసతి కల్పించాలని సూచించారు. భద్రతాపరంగా ఇబ్బందులు లేకుండా స్థానిక పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఆయా ఆలయాల్లో సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు నిర్వహించాలని, భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా హెల్ప్ డెస్కులు, పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్థానిక అధికార యంత్రాంగంతో సమన్వయం చేసుకొని అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తులకు సేవలు అందించేందుకు శ్రీవారి సేవకులను ఆహ్వానించాలని, భక్తుల కోసం వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. చైన్నై, బెంగళూరు, హైదరాబాద్, ముంబయి స్థానిక సలహా మండళ్లతో చర్చించి ఆయా ఆలయాల్లో చక్కటి ఏర్పాట్లు చేస్తామమన్నారు. ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో భక్తులను ఆకట్టుకునేలా ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో టిటిడి ఎస్ఇ-3 సత్యనారాయణ, ఎస్ఇ ఎలక్ట్రికల్ వెంకటేశ్వర్లు, తిరుపతి విజివో మనోహర్, డెప్యూటీ ఈఓలు గుణ భూషణ్ రెడ్డి, గోవిందరాజన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేటలో అనుమానాస్పద స్థితిలో దంపతులు మృతి..

హైదరాబాద్, నవంబర్ 17: కామారెడ్డి జిల్లాలో దంపతులు అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. ఈ సంఘటన గురువారం కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట్ మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని నాగిరెడ్డిపేట్ గ్రామ శివారులో గల ఒక కోళ్ల ఫారంలో కాపలా ఉండే భార్యభర్తలు అల్లపురం యేసయ్య(45), అల్లాపురం సాయవ్వ(40)లు గదిలో పడుకున్న చోటనే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను తెలు

అక్రమరీతిలో ఓటర్ల డేటా సేకరణ.. కర్నాటక సీఎంపై ఆరోపణలు

బెంగుళూరు, నవంబర్ 17:: ఓటర్ల నుంచి అక్రమరీతిలో డేటాను సేకరిస్తున్నట్లు కర్నాటక సీఎం బసవరాజ్ బొమ్మైపై ఆరోపణలు వస్తున్నాయి. ఓ ఎన్జీవో ద్వారా బెంగుళూరు ఓటర్ల నుంచి డేటా సేకరించినట్లు తెలుస్తోంది. సీఎం బొమ్మై ఎన్నికల ఫ్రాడ్‌కు పాల్పడ్డారని, ఆయన తక్షణమే రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. చిలుమే ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ద్వారా ఓటర్ల నుంచి అదనపు సమాచారాన్ని సేకరించినట్లు కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తోంది. ఎన్నికల సంఘం ద్వారా ఓ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి, ఆ సమయంలో ఓటర్ల నుంచి వ్యక్తిగత సమాచారాన్ని సేకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

కులం, విద్యార్హతలు, మాతృభాష, ఆధార్ సంఖ్య, ఇతర వివరాలను ఎన్జీవో సేకరించింది. అయితే బూత్ లెవల్ ఆఫీసర్లమంటూ ఎన్జీవో ఆ డేటాను సేకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. సీఎం బొమ్మై, బెంగుళూరు నగరపాలక కమీషనర్, ఇతర అధికారులపై కాంగ్రెస్ పార్టీ పోలీసు కమీషనర్‌కు ఫిర్యాదు చేసింది. ఎన్నికల అక్రమాలకు సీఎం పాల్పడ్డారని, ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి, అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజల నుంచి సేకరించిన డేటాను ప్రభుత్వం సైట్‌లో పొందుపరచలేదని, ప్రైవేట్ సంస్థకు చెందిన డిజిటల్ సమీక్ష అప్లికేషన్‌లో అప్‌లోడ్ చేసినట్లు కాంగ్రెస్ ఆరోపించింది. కాంగ్రెస్ పార్టీ చేసిన ఆరోపణలను సీఎం బొమ్మై కొట్టిపారేశారు. ఆ ఆరోపణలు నిరాధారమన్నారు. ఈ అంశంలో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేయాలని ప్రభుత్వ అధికారుల్ని ఆదేశించినట్లు తెలిపారు.

మంత్రి ఇంట్లో 25 మంది సభ్యుల ఐటీ బృందం సోదాలు

పాట్నా:, నవంబర్ 17::బీహార్‌కు చెందిన పరిశ్రమల శాఖ మంత్రి సమీర్ కుమార్ మహాసేత్ ఇంట్లో ఇవాళ ఆదాయపన్ను శాఖ అధికారులు సోదాలు చేస్తున్నారు. ఐటీశాఖకు చెందిన సుమారు 25 మంది సభ్యులు మంత్రి ఇంట్లో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఆయన ఇంటితో పాటు ఆఫీసులోనూ సోదాలు జరుగుతున్నాయి.తనిఖీలకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా వెల్లడికాలేదు.

స్కైరూట్ టీమ్‌కు గుడ్ లక్ చెప్పిన కేటీఆర్

హైదరాబాద్, నవంబర్ 17: హైదరాబాద్‌కి చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ లిమిటెడ్ సంస్థ రూపొందించిన వీకేఎస్ రాకెట్ రేపు నింగిలోకి దూసుకెళ్లనుంది. ఈ నేపథ్యంలో స్కైరూట్ టీమ్‌కు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ గుడ్ లక్ చెప్పారు. సక్సెస్ కోసం మేమంతా ఎదురు చూస్తున్నామని కేటీఆర్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

దేశంలో తొలి ప్రైవేటు రాకెట్ ప్రయోగానికి అంతా సిద్ధమైంది. ఇప్పటివరకు ఇస్రో తయారుచేసిన రాకెట్లను ప్రయోగించడం మాత్రమే మనం చూశాం. కానీ మొదటిసారిగా ఓ ప్రైవేట్ సంస్థ అభివృద్ధి చేసిన రాకెట్ నింగిలోకి దూసుకెళ్లడానికి రెడీగా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి శుక్రవారం ఉదయం 11.30 గంటలకు ప్రయోగించనున్నారు. హైదరాబాద్‌కు చెందిన స్పేస్ స్టార్టప్ అయిన స్కైరూట్ ఏరోస్పేస్ రూపొందించిన ఈ రాకెట్‌కు విక్రమ్-ఎస్ అని నామకరణం చేశారు. కాగా, దీనిని ఈ నెల 12నే ప్రయోగించాల్సి ఉండగా, వాతావరణం అనుకూలించకపోవడంతో శాస్త్రవేత్తలు వాయిదావేస్తూ వస్తున్నాయి. అయితే నవంబర్ 18న ఈ రాకెట్‌ను నింగిలోకి పంపించాలని తాజాగా నిర్ణయించారు.

ఇది రెండు భారతీయ, ఒక విదేశీ పేలోడ్లను కక్షలోకి తీసుకెళ్లనుంది. వాటిలో భారత్, అమెరికా, సింగపూర్, ఇండోనేషియాకు చెందిన విద్యార్థులు అభివృద్ధి చేసిన 2.5 కిలోల పేలోడ్ అయిన ఫన్-శాట్, చెన్నైకి చెందిన ఏరోస్పేస్ స్టార్టప్ స్పేస్ కిడ్జ్ ఉన్నాయి. ఈ మిషన్ ద్వారా దేశంలో అంతరిక్షంలోకి రాకెట్‌ను ప్రయోగించిన తొలి ప్రైవేట్ అంతరిక్ష సంస్థగా స్కైరూట్ అవతరించనుంది.

భారతదేశ జియోస్పేషియల్ ఆర్థిక వ్యవస్థ 2025 చివరి నాటికి 61,000 కోట్ల రూపాయలకు చేరుతుంది... కేంద్ర జలశక్తి మంత్రి శ్రీ గజేంద్ర సింగ్ షెకావత్

న్యూఢిల్లీ, నవంబర్ 17:సాంకేతిక రంగంలో భారతదేశం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్నదని కేంద్ర జలశక్తి మంత్రి శ్రీ గజేంద్ర సింగ్ షెకావత్ అన్నారు సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో పెద్దసంఖ్యలో అంకుర సంస్థలు (స్టార్టప్‌లు) ఏర్పాటవుతున్నాయని శ్రీ గజేంద్ర సింగ్ షెకావత్ పేర్కొన్నారు. దేశంలో దాదాపు 250 జియోస్పేషియల్ స్టార్టప్‌లు ఉన్నాయని, ఇవి ఆవిష్కరణ స్ఫూర్తికి నిదర్శనమని శ్రీ షెకావత్ అన్నారు. ఈరోజు హైదరాబాద్‌లో ప్రారంభమైన 3 రోజుల (15-17 నవంబర్ 2022)జియో స్మార్ట్ ఇండియా 2022 సదస్సులో కేంద్ర మంత్రి కీలకోపన్యాసం చేశారు.

ఈ కార్యక్రమంలో శ్రీ షెకావత్ ప్రసంగిస్తూ వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, అటవీ, జలవనరుల నిర్వహణ, పట్టణ ప్రణాళిక రంగాల్లో వివిధ జియోస్పేషియల్ ప్రాజెక్టులు ప్రయోగాత్మకంగా అమలు జరుగుతున్నాయని మంత్రి వివరించారు. దేశంలో ఏర్పాటైన అంకుర సంస్థల సంఖ్య యువత సామర్థ్యం సాధించిన అభివృద్ధిని తెలియజేస్తుందని అన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన రెండవ ఐక్యరాజ్యసమితి వరల్డ్ జియోస్పేషియల్ ఇన్ఫర్మేషన్ కాంగ్రెస్ (యుఎన్‌డబ్ల్యుజిఐసి) ప్రారంభోత్సవంలో ప్రధానమంత్రి చేసిన ప్రసంగాన్ని శ్రీ షెకావత్ గుర్తు చేశారు. అట్టడుగున ఉన్న వారికి ప్రయోజనం కలిగించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పనిచేస్తుందని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ చేసిన ప్రకటనను శ్రీ షెకావత్ గుర్తు చేశారు.

సాంకేతిక రంగంలో దేశం వేగంగా అభివృద్ధి చెందుతోంది: కేంద్ర జలశక్తి మంత్రి శ్రీ గజేంద్ర సింగ్ షెకావత్:

ప్రజలకు నీరు జీవనాధారం గా గుర్తించిన కేంద్ర ప్రభుత్వం జల సంబంధిత సమస్యలను పరిష్కరించడానికి అనేక చర్యలు తీసుకుందని శ్రీ షెకావత్ తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి ప్రజలకు ప్రయోజనం కలిగించే అంశానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. గతంలో జలవనరుల అంశం తొమ్మిది మంత్రిత్వ శాఖల పర్యవేక్షణలో ఉండేవని శ్రీ షేకావత్ తెలిపారు. జల సంబంధిత అంశాలను సమర్థంగా అమలు చేసేందుకు తమ ప్రభుత్వం జలవనరులను జల్ శక్తి మంత్రిత్వ శాఖ పరిధిలోకి తెచ్చిందని వివరించారు. గంగా మరియు దాని ఉపనదులు పునరుద్ధరణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధాన కార్యక్రమంగా 'నమామి గంగే' పథకం అమలు చేస్తున్నదని శ్రీ షెకావత్ వివరించారు. దీనికి అదనంగా,జలశక్తి మంత్రిత్వ శాఖ జలవనరుల శాఖ, జల వనరుల అభివృద్ధి శాఖ సహకారంతో 'నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్ట్' (ఔఊఖ)ని కూడా చేపట్టిందని మంత్రి తెలిపారు.నీటి వనరుల నిర్వహణ కోసం కార్యక్రమాలు అమలు చేస్తున్న అన్ని విభాగాలకు ప్రణాళిక మరియు సమర్థ భూ జలవనరుల సమాచారం, సమాచార వ్యవస్థ అందుబాటులోకి తెస్తున్నామని మంత్రి వివరించారు.

'నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్ట్' అమలు కోసం ఇస్రో, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఔఖీూఅ) ప్రధాన ఏజెన్సీలుగా పనిచేస్తాయని శ్రీ షెకావత్ తెలిపారు.నీటి వనరుల రంగంలో జియోస్పేషియల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా ఉపయోగించడాన్ని అనేక కార్యకలాపాలు చేపట్టామని తెలిపారు.ఎనీ సాంకేతికతలు జీపీఎస్ అనుబంధ కమ్యూనికేషన్ పరిజ్ఞానంతో కలిసి అమలు జరుగుతున్నాయని అన్నారు. ఈ ప్రాజెక్టులు దేశం సమగ్ర అభివృద్ధికి భౌగోళిక మరియు అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడానికి ఉపకరిస్తాయని వివరించారు.

గ్రామీణ మరియు పట్టణ అభివృద్ధి మరియు ఆర్థిక, సామాజిక మరియు పర్యావరణ ప్రమాణాలు కలిగి ఉన్న సమగ్ర జాతీయ అభివృద్ధికి సహకరించే జియోస్పేషియల్ రంగం అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న చర్యలకు పరిశ్రమ మరియు విద్యాసంస్థలు సహకరించాలని మంత్రి సూచించారు.

జియోస్పేషియల్ అర్థ, జియోస్పేషియల్ స్ట్రాటజీ ఫర్ నేషనల్ డెవలప్‌మెంట్ అనే రెండు నివేదికలను జలశక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, ఐఎస్ఆర్ఎస్ అధ్యక్షుడు డాక్టర్ ప్రకాష్ చౌహాన్, ఐఎస్జీ కార్యదర్శి డాక్టర్ రాజ్ కుమార్, భూ శాస్త్ర మంత్రిత్వ శాఖ కార్యదర్శి డాక్టర్ రవిచంద్రన్ని సమక్షంలో విడుదల చేశారు. భారత జియోస్పేషియల్ పరిశ్రమ సేవలు అందించే రంగంగా కాకుండా పరిష్కారాల పరిశ్రమగా అభివృద్ధి చెందుతుందని నివేదికలు ప్రముఖంగా పేర్కొన్నాయి. రక్షణ, నిఘా, సేవలు, పట్టణ అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, వ్యవసాయం, భూ నిర్వహణ రంగాల్లో మార్కెట్ అభివృద్ధి సాధించేందుకు జియోస్పేషియల్ రంగం దోహదపడుతుందని భారతదేశం జియోస్పేషియల్ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం దాదాపు 41600 కోట్ల రూపాయల వరకు ఉంది. ఈ రంగం 5,45,000 మందికి ఉపాధి కల్పిస్తోంది, 2025 చివరి నాటికి జియోస్పేషియల్ రంగం 61,000 కోట్ల రూపాయల మార్కెట్ గా ఎదుగుతుందని జియో స్మార్ట్ ఇండియా 2022 సదస్సులో విడుదల చేసిన జియోస్పేషియల్ స్ట్రాటజీ ఫర్ నేషనల్ డెవలప్‌మెంట్ నివేదిక పేర్కొంది.

సమస్యల పరిష్కారం, బహుళ ఆధారిత పరిష్కార మార్గాలను అమలు చేయడానికి అనుసరించవలసిన కార్యక్రమాన్ని రూపొందించడానికి జియో స్మార్ట్ ఇండియా మరియు ఎఖీూ/ఎూఉ జాతీయ సదస్సులు సంయుక్తంగా నిర్వహించబడుతున్నాయి. సామాజిక-ఆర్థిక సవాళ్లను చర్చల ద్వారా పరిష్కరించడం, ప్రభుత్వం, మ్యాప్ సంస్థలు , పరిశోధకులు, విద్యావేత్తలు మరియు ప్రైవేట్ పరిశ్రమలు మరియు ప్రాదేశిక సమాచారం, వినియోగదారుల సమాచారంతో కూడిన జియోస్పేషియల్ వ్యవస్థను అభివృద్ధి చేసి అందుబాటులోకి తేవడం, ప్రగతిశీల విధాన మార్పులు అమలు చేయడం తదితర అంశాలు సదస్సులో చర్చకు రానున్నాయి. ప్రపంచవ్యాప్తంగా జియోస్పేషియల్ రంగానికి చెందిన వివిధ ప్రభుత్వ, ప్రైవేటు, విద్యా రంగాలకు 2500 మంది ప్రతినిధులు 3 రోజుల (15-17 నవంబర్ 2022) 'జియో స్మార్ట్ ఇండియా 2022' సదస్సులో పాల్గొంటారు. సింపోజియం ఉద్దేశ్యం రిమోట్ సెన్సింగ్, ఉమా నిపుణులు, విద్యావేత్తలు, పరిశోధకులు మరియు విద్యార్థులను ఒక వేదిక పైకి తీసుకువచ్చి సమస్యలు మరియు సవాళ్లపై చర్చలు జరిపి పరిష్కార మార్గాలు అందించడం లక్ష్యంగా సదస్సులను నిర్వహిస్తున్నారు.

విద్యార్థినులకు హెల్త్ కిట్లు.. పంపిణీకి తెలంగాణ ప్రభుత్వం ఏర్పాట్లు

హైదరాబాద్, నవంబర్ 17: రాష్ట్రంలో వైద్య, ఆరోగ్య రంగాన్ని పటిష్ఠం చేస్తున్న తెలంగాణ ప్రభుత్వం.. విద్యార్థినుల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా బడ్జెట్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్న విధంగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థినులకు ఉచితంగా అడోల్‌సెంట్ హెల్త్ కిట్స్ (శానిటరీ హెల్త్ అండ్ హైజీనిక్ కిట్లు) పంపిణీకి ఏర్పాట్లు చేస్తోంది. ఇందుక గానూ మొత్తం రూ.69.52 కోట్లతో అడలోసెంట్ కిట్ల కొనుగోలు, పంపిణీ కోసం ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. ఈ మేరకు హెల్త్ సెక్రటరీ రిజ్వీ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోని 8 నుంచి 12వ తరగతి చదువుతున్న దాదాపు 11లక్షల మంది విద్యార్థినులకు లబ్ధి చేకూరనుంది.

ఈ ఆర్థిక సంవత్సరంలో మిగిలిన ఆరు నెలల కోసం11 లక్షల కిట్లను ప్రభుత్వం కొనుగోలు చేయనుంది. ఈ కిట్‌లో ఆరు శానిటరీ న్యాప్‌కిన్ ప్యాక్స్, వాటర్ బాటిల్, ఒక బ్యాగ్ ఉంటుంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గానూ మొత్తం 22 లక్షల కిట్లు కొనుగోలు చేయనుంది. ఈ కార్యక్రమం అమలు చేస్తామని ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఇప్పుడు అమలు చేస్తోంది.

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5 ప్రకారం, 15-24 ఏళ్ల మధ్య వయసున్న యువతుల్లో సుమారు 32శాతం మంది న్యాప్‌కిన్ లాగా క్లాత్ వినియోగిస్తున్నారు. దీంతో గర్భాశయ, మూత్రకోశ సంబంధ ఇన్‌ఫెక్షన్లు వస్తున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం హెల్త్ అండ్ హైజీనిక్ కిట్లు పంపిణీ చేయాలని నిర్ణయించింది. 14 నుంచి 19 సంవత్సరాల వయసున్న కౌమార బాలికలు రుతుక్రమం సమయంలో శుభ్రత పాటించేందుకు ఇవి ఉపయోగపడనున్నాయి. దీంతో వారు ఆరోగ్యవంతంగా ఉండేందుకు, తద్వారా చదువుపై మరింత శ్రద్ధ చూపించేందుకు అవకాశం ఉంటుంది. విద్యార్థినుల హాజరు శాతం కూడా పెరిగేందుకు తోడ్పడుతుంది.

తీరు మారని ఆర్టీసీ బస్టాండ్లు.. ఎంఆర్‌పీ ధరల కంటే అధికంగా వసూలు చేస్తున్న వ్యాపారులు

హైదరాబాద్, నవంబర్ 17: హైదరాబాద్‌లోని బస్టాండ్‌ల ఆవరణలోని షాపులో నిలువు దోపిడి జరుగుతుంది. బస్టాండ్ కి వచ్చిన ప్రయాణికులు వాటర్ బాటిల్ కొంటే వారి వద్ద రూ.25వసూలు చేస్తున్నారు ఆ షాపు యజమానులు. బాటిల్ పై ఎంఆర్‌పీ రూ.20అని స్పష్టంగా ముద్రించి ఉన్నా.. బాటిల్‌కు రూ.25 వసూలు చేస్తున్నారు. ఇదేమని ప్రయాణికులు అడిగితే కూలింగ్ ఛార్జీలంటూ ఉల్టా దబాయిస్తున్న పరిస్థితి. ఇలా.. జూబ్లి, ఎంజీబీఎస్ నుంచి మొదలుకుని దిల్‌సుఖ్‌నగర్, కూకట్‌పల్లి తదితర చిన్నా చితకా బస్టాండ్లలో సైతం వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఒక్క వాటర్ అని కాదు తినే ఆహార పదార్థాలన్నింటిపై నిర్ణయించిన రేట్లకన్నా అధికంగా వసూలు చేస్తున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఆర్టీసీ ఎండీగా సీనియర్ ఐపీఎస్ అధికారి సజ్జనార్ వచ్చిన తర్వాత బస్టాండ్లను ప్రక్షాళన చేసేందుకు అనేక చర్యలు తీసుకున్నారు.

బస్టాండ్ ఆవరణలోని షాపులు, ఇతర ప్రధానమైన ప్రాంతాల్లో? ఈ బస్టాండ్‌లోని షాపుల్లో అన్ని వస్తువులు ఎంఆర్‌పీకే విక్రయించబడును అనే బోర్డులను తగిలించి మానిటరింగ్ చేశారు. అయితే గత కొంత కాలంగా అధికారుల పర్యవేక్షణ లోపించడంతోనే వ్యాపారులు తిరిగి గతంలో లాగే ఎంఆర్‌పీ రేట్ కంటే అధికంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అలాగే నగరంలోని ఆర్టీసీ బస్టాండ్లలో పారిశుద్ధ్యనిర్వహణ సరిగా లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. టాయిలెట్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడం, వ్యర్థాలను తొలగించకపోవడంతో దుర్వాసన వెదజల్లుతుందనే విమర్శలున్నాయి. దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు అత్యవసరమై మరుగు దొడ్లకు వెళ్తే? దుర్గంధాన్ని భరించలేక తీవ్ర ఇంబ్బందులు పడుతున్నారని తెలుస్తోంది.

అలాగే మరుగు దొడ్డికి రూ.5వసూలు చేయాల్సి ఉండగా రూ.10 వసూలు చేస్తున్నారు. మూత్రశాలకు వెళ్లే వారివద్ద రూ.2 వసూలు చేయాల్సి ఉండగా రూ.5వసూలు చేస్తున్నారు. మరుగుదొడ్లలో కనీస పారిశుద్ధ్య మేయింటనెన్స్ చేయకుండానే నిర్దేశించిన రుసుం కంటే అధికంగా వసూలు చేయడం పట్ల ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

నగరంలోని బస్టాండ్లలోని షాపుల్లో వస్తువులను అధిక రేట్లకు అమ్ముతున్నా ఆర్టీసీ అధికారులు నియంత్రించడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. షాపుల్లో వస్తువులను అధిక రేట్లకు అమ్ముతున్నారని అధికారులకు ఫిర్యాదు చేసినా పెద్దగా చర్యలు తీసుకోవడం లేదని విమర్శలున్నాయి. అధిక ధరలపై ఎవరైనా ప్రయాణికులు ఇదేంటని అడిగినప్పుడు వ్యాపారులు వారితో వాదనలకు దిగుతున్న సందర్భాలున్నాయి. గట్టిగా నిలదీసిన వారికి ఎంఆర్‌పీ రేట్లకు, మనకెందుకు గొడవ అనుకునే వారి వద్ద దర్జాగా అధిక రుసుం వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా ఆర్టీసీ విజిలన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించి బస్టాండ్లలో వ్యాపారుల దోపిడీని అరికట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మహా భాగ్యనగర బ్రాహ్మణ సేవా సమితి నూతన కమిటీ ఎన్నిక

హైదరాబాద్, నవంబర్ 17: మహా భాగ్యనగర బ్రాహ్మణ సేవా సమితి (ఎంబీబీఎస్) నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దోర్బల కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా ఘణపురం రాంప్రసాదశర్మ, కోశాధికారిగా యలమంచి రామకృష్ణ శర్మ, సమన్వయ కర్తగా మహాదేవబట్ల లక్ష్మణప్రసాదశర్మ, ఉపాధ్యక్షులుగా వడ్డిచర్ల విష్ణుమూర్తిశర్మ, జోషి రమేశ్, మహాదేవబట్ల దిలీప్‌కుమార్‌శర్మ, సీహెచ్ భవాని, సంయుక్త కార్యదర్శులుగా జ్యోషి సత్యనారాయణ, రాజనాల వెంకటేశ్వరశర్మ, యలమంచి చంద్రశేఖరశర్మ, త్రివేణి, కార్యనిర్వాహక కార్యదర్శిగా సిరిసిల్ల రామశర్మ, వైదిక కార్యదర్శులు కొడకండ్ల రాధాకృష్ణశర్మ, కూచివంశీ, కార్యనిర్వాహక కమిటీ సభ్యులుగా మధుసూరి మహాదేవశర్మ, విఠాల మురళీధరశర్మ, శ్రవణ్ కుమారాచార్యులు, గోళ్ల గోవర్ధన్‌శర్మ, ఎన్.చంద్రశేఖరశర్మ, ముఖ్యసలహాదారులు నెమ్మాని విష్ణుమూర్తిశర్మ, డాక్టర్ తుమ్మూరి లక్ష్మణరావు, దామెర సత్యనారాయణశర్మ, యలమంచి విఠలేశ్వరశర్మలను ఎన్నుకున్నట్లు ఓ ప్రకటనలో కమిటీ తెలిపింది.

రు. 2 కోట్లతో నిర్మించే బ్రిడ్జి పనులకు శంఖుస్థాపన చేసిన ఎమ్మెల్యే చెన్నమనేని

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 17: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ - కోరుట్ల ప్రధాన రోడ్లో మర్రిపల్లి వద్ద రు. 2 కోట్లతో నిర్మించే హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు భూమి పూజ చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న రోజుల్లో సుమారు 60 కోట్లతో పలు రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణానికి అనుమతులు రాబోతున్నాయని అన్నారు. నిర్మాణంలో నాణ్యత విషయంలో అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి త్వరలో పూర్తి చేయాలని అన్నారు. తరువాత కస్తూరిబా బాలికల పాఠశాలలో హై మాక్స్ లైట్లు ప్రారంభించారు. విద్యార్థినులతో మాట్లాడి వారికి కావాల్సిన మౌలిక వసతులు ఏర్పాటుకు ప్రయత్నిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ అరుణ రాఘవ రెడ్డి, ఎంపీపీ బండ మల్లేశం యాదవ్, సింగిల్ విండో చైర్మన్ ఏనుగ తిరుపతి రెడ్డి, టిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, గడ్డం హనుమాన్లు, మల్లేశం, టిఆర్ఎస్ అధ్యక్షుడు గోస్కుల రవి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కెప్టెన్ లక్ష్మీకాంతరావు జన్మదిన వేడుకలు

కరీంనగర్, నవంబర్ 17: (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర సాధనలో కెప్టెన్ సాబ్ ముందుండి ఉద్యమాన్ని నడిపారు. ఆయన చేసిన సేవలు మరువలేనివని కరీంనగర్ మేయర్ వై సునీల్ రావు అన్నారు. తెలంగాణ పోరాట యోధుడు, మాజీ రాజ్యసభ సభ్యులు కెప్టెన్ లక్ష్మీకాంతరావు పుట్టినరోజు వేడుకలు గురువారం కరీంనగర్ తెలంగాణ చౌక్ లో ఘనంగా జరిగాయి. సందర్భంగా అమరావతి సలీం ఆధ్వర్యంలో నగరంలోని తెలంగాణ చౌక్ లో కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ యాదగిరి సునీల్ రావు, జెడ్పీ చైర్ పర్సన్ కనుమల్ల విజయ , జడ్పీ వైస్ చైర్మన్ అమరావతి గోపాల్ రావు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

సుంద రీకరణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే రమేష్ బాబు

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 17: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని నంది కమాన్ వద్ద రు. 87 లక్షలతో ఏర్పాటు చేసే సుందరీకరణ పనులను గురువారం ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యిక్కడ చేపట్టబోయే సుందరీకరణ పనులు అద్భుతంగా వుండాలని వచ్చే యాత్రికులకు వంద సంవత్సరాలు గుర్తు వుండే విధంగా తీర్చి దిద్దాలని అధికారులకు సూచించారు. ఈ పనులు కమాన్ వద్ద ఏర్పాటు చేస్తున్నందున యాత్రికులకు, అటు కరీంనగర్, సిరిసిల్ల వెళ్ళే ప్రయాణీకులకు ఎటువంటి యిబ్బందులు లేకుండా చేపట్టాలన్నారు. యిప్పటికీ రు. 46 లక్షలతో సాయి రక్ష ఢాబా వద్ద చేపట్టిన సుందరీకరణ పనులు 50 శాతం పూర్తి అయినాయన్నారు. రు.10 కోట్లతో వేములవాడ - కోరుట్ల, గుడి నుండి జగిత్యాల బస్ స్టాండ్ వరకు రోడ్ నిర్మాణాలకు టెండర్లు పిలిచారని వాటిని కూడా త్వరలో పనులు చేపడతామన్నారు. త్వరలో రు. 10 కోట్లతో సినారె భవనం, స్టేడియం నిర్మాణాలకు టెండర్లు పిలవడం జరుగుతుందన్నారు. బద్ది పోచమ్మ స్థల సేకరణ పూర్తి అయ్యిందని అందులో వున్న కట్టడాల తొలగింపు ప్రక్రియ పూర్తి అయ్యిందని త్వరలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్.పి చైర్మన్ న్యాలకొండ అరుణ మున్సిపల్ చైర్మన్ రామతీర్థం మాధవి, జెడ్.పీ.టీ.సీ మ్యాకల రవి , ఎం.పీ.పీ బూర వజ్రమ్మ , సింగిల్ విండో చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి, కౌన్సిలర్లు యాచమనేని శ్రీనివాసరావు, ఇప్ప పుల్ల అజయ్, సిరిగిరి చందు, టిఆర్ఎస్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, నీలం శేఖర్, పుల్కం రాజు, ఆర్ అండ్ బి అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బ్రిటీషర్లకు సావార్కర్ భయపడ్డారు: రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, నవంబర్ 17: హిందుత్వవాది వినాయక్ దామోదర్ సావార్కర్‌పై రాహుల్ గాంధీ ఇవాళ కూడా వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. భారత్ జోడో యాత్రలో భాగంగా మహారాష్ట్రలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆయన ఇవాళ మీడియాతో మాట్లాడారు. వీడీ సావార్కర్‌పై మళ్లీ ఆరోపణలు గుప్పించారు. బ్రిటీషర్లకు సావార్కర్ భయపడ్డారని, వాళ్లకు సేవకుడిగా పని చేసుకునేందుకు ఆయన ప్రయత్నించారని, దీని కోసం బ్రిట

తన్య స్కూల్ డీజీఎం లక్ష్మణ్ రావు జన్మదిన వేడుకలు

- శుభాకాంక్షలు తెలిపి శ్రీ చైతన్య అధ్యాపక బృందం, సిబ్బంది

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 17: (నేటినిజం ప్రతినిధి): శ్రీ చైతన్య స్కూల్ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ జనరల్ మేనేజర్ జి. లక్ష్మణ్ రావు జన్మదిన వేడుకలు వేములవాడ శ్రీ చైతన్య స్కూల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ సు ది ష్ కుమారి, అధ్యాపక బృందం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుది ష్ కుమారి మాట్లాడుతూ నిత్యం విద్యార్థులకు మంచి విద్యను అందించాలని పరితపించే సారు ఇలాంటి పుట్టినరోజు మరెన్నో జరుపుకోవాలని మనస్ఫూర్తిగా రాజన్నను వేడుకున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ పి.శేఖర్, పి.పి.టి సృజన, ఏవో సుధీర్, శశాంక్,పి.టి సుధాకర్, కరాటే మాస్టర్ అబ్దుల్ మన్నన్ తదితరులు పాల్గొన్నారు.

ఇట్మీ టెక్నాలజీ అవార్డుల రెండవ ఎడిషన్ విజేతలను వెల్లడించిన ఇండియా ఇట్మీ సొసైటీ

ముంబై, నవంబర్ 16, 2022 : ఇండియా ఇట్మీ సొసైటీ నేడు ఇండియా ఇట్మీ సొసైటీ అవార్డులు 2022 విజేతలను వెల్లడించింది. ఈ అవార్డులను డిసెంబర్ 10, 2022 న ఉత్తర్‌ప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడా వద్ద నున్న ఇండియా ఎక్స్‌పోజిషన్ మార్ట్ వద్ద అందజేయనున్నారు. టెక్స్‌టైల్ ఇంజినీరింగ్ రంగంలో సానుకూల మార్పులు తీసుకురావడానికి అసాధారణ తోడ్పాటునందించిన వారిని గుర్తించేందుకు ఈ అవార్డులు అందజేస్తున్నారు.

ఎలాంటి వివాదాలకూ తావులేకుండా ఇండియా ఇట్మీ సొసైటీ ఈ అవార్డుల కోసం దరఖాస్తులను జూలై 2022న తెరిచింది. ఈ దరఖాస్తులను విఖ్యాత న్యాయనిర్ణేతల బృందం సమీక్షించి విజేతలను ఎంపిక చేసింది. ఈ అవార్డులలో టెక్స్‌టైల్ ఇంజినీరింగ్ పరిశ్రమలో అత్యుత్తమ ప్రదర్శన విభాగంలో ఐదు అవార్డులు అందజేశారు. స్పిన్నింగ్ విభాగంలో లక్ష్మీ మెషీన్ వర్క్స్ లిమిటెడ్ ; వీవింగ్ మరియు ప్రిపరేటరీ విభాగంలో రబటెక్స్ ఇండస్ట్రీస్ ; ఫినీషింగ్‌విభాగంలో టెక్స్‌ప్యాబ్ ఇంజినీర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్; ప్రింటింగ్ విభాగంలో కలర్‌జెట్ ఇండియా లిమిటెడ్ ; మొత్తం టెక్స్‌టైల్ మెషినరీ విభాగంలో యాక్సరీ కోసం లక్ష్మి కార్డ్ క్లాతింగ్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ ఉన్నాయి.

కాలుష్య నియంత్రణ సాంకేతికత కోసం అత్యుత్తమ కార్యక్రమాలు విభాగంలో ఎస్ ఏ ఫార్మాకెమ్ ప్రైవేట్ లిమిటెడ్ అవార్డు అందుకుంది. ఇవి కాకుండా మహిళల కోసం పలు ప్రత్యేక అవార్డులతో పాటుగా రీసెర్చ్ ఎక్స్‌లెన్స్, టెక్స్‌టైల్ మెస్ట్రో అవార్డులను సైతం అందజేశారు.

ఇండియా ఇంటర్నేషనల్ టెక్స్‌టైల్ మెషినరీ ఎగ్జిబిషన్స్ సొసైటీ స్టీరింగ్ కమిటీ ఛైర్మన్ మరియు సభ్యుడు హరి శంకర్ మాట్లాడుతూ "ఇండియా ఇట్మీ సొసైటీ అవార్డులు ప్రతి సంచిక మరింత పెద్దగా మారుతుంది. ఈ అవార్డులు ఇంత పెద్దగా మారడానికి సహచర పార్టిస్పెంట్స్ కారణం. వారి అంకిత భావం, కష్టం ఈ అవార్డులకు మరింత విలువను సృష్టించాయి" అని అన్నారు.

ఈ అవార్డులను 10 డిసెంబర్ 2022న ఇండియా ఎక్స్‌పోజిషన్ మార్ట్ వద్ద అందజేస్తారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన సీఈఓ సదస్సు ? ఎంపవరింగ్ టెక్స్‌టైల్స్ త్రూ టెక్నాలజీ వద్ద ఇది జరుగనుంది.

కంపెనీ యొక్క ఫ్రంట్‌లైన్ కార్మికుల కోసం వ్యర్థ పెట్ బాటిల్స్ నుంచి పర్యావరణ అనుకూల యూనిఫార్మ్‌ను తయారుచేసిన ఇండియన్ ఆయిల్

హైదరాబాద్, నవంబర్ 17: 'అన్‌బాటిల్డ్?టువార్డ్స్ ఏ గ్రీనర్ ఫ్యూచర్' శీర్షికన నిర్వహించిన భారీ వేడుకలో ఇండియన్ ఆయిల్ ఛైర్మన్ శ్రీ ఎస్ఎం వైద్య ప్రత్యేకమైన సస్టెయినబల్ మరియు గ్రీన్ యూనిఫార్మ్‌ను విడుదల చేశారు. దాదాపు మూడు లక్షల ఇండియన్ ఆయిల్ ఫ్యూయల్ స్టేషన్ అటెండెంట్స్ మరియు ఇండేన్ ఎల్‌పీజీ గ్యాస్ డెలివరీ పర్సనల్ కోసం దీనిని డిజైన్ చేశారు. ఈ యూనిఫార్మ్ కోసం డ్రెస్ మెటీరియల్‌ను పెట్‌బాటిల్స్ నుంచి ఉత్పత్తి చేశారు. ఈ కార్యక్రమం ద్వారా 405 టన్నుల పెట్‌బాటిల్స్ రీసైకిల్ చేశారు. ఇది దాదాపు 20 మిలియన్ బాటిల్స్‌కు సమానం. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో సుప్రసిద్ధ నటి మరియు పర్యావరణ వేత్త భూమి పెండేకర్ సైతం పాల్గొన్నారు

ఈ సందర్భంగా శ్రీ ఎస్ ఎం వైద్య మాట్లాడుతూ "ఈ పర్యావరణ అనుకూల యూనిఫార్మ్ మా హరిత నిబద్ధతను చాటతాయి. ప్రతి సంవత్సరం దాదాపు 8 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ సముద్రంలో చేరుతుంది. అంతేకాకుండా దాదాపు 150 మిలియన్ మెట్రిక్ టన్నులు మెరైన్ వ్యవస్థలో సర్క్యులేట్ అవుతుంది. ఇదే వేగంతో వెళ్తే 2050 నాటికి సముద్రంలో చేపల కంటే ప్లాస్టిక్ అధికంగా ఉండనుంది. ఈ ప్లాస్టిక్ నుంచి ఫ్యాబ్రిక్ ఉత్పత్తి చేయడమన్నది, సమస్యలు మనకు అవకాశాలను ఎలా సృష్టిస్తాయో వెల్లడించేందుకు ఓ నమూనాగా ఉంటుంది" అని అన్నారు. ఆయనే మాట్లాడుతూ ఇండియన్ ఆయిల్ చేపట్టిన ఇతర పర్యావరణ అనుకూల పద్ధతులు సైతం వెల్లడించారు.

భూమి మాట్లాడుతూ దేశంలో అతిపెద్ద ఇంధన కంపెనీ ఓ మహోన్నత కార్యక్రమంతో ముందుకు రావడం పట్ల సంతోషంగా ఉన్నాను అని అన్నారు.

ప్రధాన సమస్యలను సత్వరమే పరిష్కరించుకుందాం

శాసనసభ్యులు చెన్నమనేని రమేష్ బాబు

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 17: (నేటినిజం ప్రతినిధి): ప్రధాన సమస్యలు సత్వరమే పరిష్కరించుకుందామని వేములవాడ ఎమ్మెల్యే రమేష్ బాబు అన్నారు. గురువారం వేములవాడ పట్టణం సంగీత నిలయం లో మండలంలోని అర్బన్,రూరల్, పట్టణ, తెరాస ప్రజాప్రతినిధులు, నాయకులతో శాసనసభ్యులు చెన్నమనేని రమేష్బాబు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన పేద దళితులకు దళిత బంధు పథకం పారదర్శకంగా వర్తించేలా స్థానిక ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకోవాలని, రెండో విడత లో1500 దళితబంధు మంజూరు అయ్యాయని మొదటి విడతగా 500 మందికి దళితబంధు ఇవ్వబోతున్నామని అన్నారు. అర్హులైన పేదలకు దళత బంధు పథకం వర్తించేలా స్థానిక ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకోవాలన్నారు. సంక్షేమ పథకాలు లబ్ధి దారులకు చేరుతున్నా యో లేదా పర్యవేక్షించాలని అన్నారు. రానున్న రోజుల్లో రెండు పడకల ఇండ్లు సొంత జాగా వున్న వారు నిర్మించుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకున్నామని అని అన్నారు. నియోజకవర్గంలో రానున్న రోజుల్లో ప్రధానమైన బ్రిడ్జీలు, రోడ్లు మంజూరీ కానున్నయాన్నారు. అన్ని పనులను వచ్చే సంవత్సరం అక్టోబర్ లోపల పూర్తి చేసుకోవాలని ముఖ్య మంత్రి గారు ఆదేశించారని అన్నారు. ఎల్లంపల్లి నీళ్ళ ద్వారా అధిక సాగులోకి వచ్చిందని ఉదాహరణకు వేములవాడ పాక్స్ పరిధిలో గతంలో 3 వేల క్వింటాళ్ల కొనుగోలు వుంటే నేడు 3 లక్షల క్వింటాళ్ల కొనుగోలు జరుగుతోందన్నారు. ముంపు గ్రామాల మిగిలిన సమస్యల త్వరలో పరిష్కారం కానున్నాయన్నారు. విద్య, వైద్య రంగానికి ప్రభుత్వం పెద్ద యెత్తున నిధులు కేటాయిస్తుందని అన్నారు. విద్య, వైద్యంపై లాభాలు ఆశించడం చాలా దుర్మార్గమన్నారు. వేములవాడ పట్టణ, దేవాలయ సమగ్రాభివృ?ధికి కట్టుబడి ఉన్నామన్నారు. త్వరలోనే బద్ది పోచమ్మ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని. మంజూరైన ప్రధాన రోడ్లు, సినారె భవనం, స్టేడియం త్వరలో పూర్తి చేస్తామన్నారు ఎన్ని ఎన్నికలు వచ్చిన ప్రజలకు సేవ చేసే మనమే గెలుస్తామని అన్నారు. డిసెంబర్ 24 న జరిగే సెస్ ఎన్నికల్లో కలిసి కట్టుగా పని చేసి, విజయం సాధించాలని పలు సూచనలు సలహాలు చేసారు. కార్యకర్తలకు అండగా ఉంటామని వారికి ఏ ఆపద వచ్చినా ముందుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామతీర్థం మాధవి , ఎం.పి.పి బూర వజ్రమ్మ , జెడ్.పి.టి.సి మ్యాకల రవి , ఫ్యాక్స్ చైర్మన్ ఏనుగు తిరుపతి రెడ్డి , కౌన్సిలర్లు నరాల శేఖర్, మారం కుమార్, యాచమనేని శ్రీనివాసరావు, టిఆర్ఎస్ పార్టీ అర్బన్, రూరల్, పట్టణ, అధ్యక్షులు ఉ రిడి ప్రవీణ్,గోస్కుల రవి, పుల్కుం రాజు, నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, పులాస నరేందర్, గడ్డం హనుమాన్లు పీర్ మహమ్మద్ ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యరాజ్యసమితి - ఎస్కేఫ్ కు చెందిన డి ఎస్ ఐ ఆర్ , సి ఎస్ ఐ ఆర్,

న్యూఢిల్లీ, నవంబర్ 17:"క్రాస్ బోర్డర్ ఇన్నోవేషన్, యాక్సిలరేషన్ అండ్ ఛాలెంజెస్ ఇన్ ఇంటర్నేషనల్ ట్రాన్స్ ఫర్ ఆఫ్ టెక్నాలజీస్" అనే అంశంపై అంతర్జాతీయ నాలెడ్జ్ షేరింగ్ వర్క్ షాప్ 2022 నవంబర్ 14 నుంచి 15 వరకు న్యూఢిల్లీలోని సి ఎస్ ఐ ఆర్ సైన్స్ సెంటర్ లో హైబ్రిడ్ మోడ్ లో జరిగింది. యునైటెడ్ నేషన్స్ ఎకనామిక్ అండ్ సోషల్ కమిషన్ ఫర్ ఏషియా ,

ఆసియన్ అండ్ ఫసిఫిక్ సెంటర్ ఫర్ ట్రాన్స్ ఫర్ ఆఫ్ టెక్నాలజీ (ఎ పి ఎస్ సి టి టి) సహకారంతో డిపార్ట్ మెంట్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (డి ఎస్ ఐ ఆర్), మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్ (సిఎస్ఐఆర్) సంయుక్త ఆధ్వర్యంలో ఈ వర్క్ షాప్ ను నిర్వహించారు.. సి ఎస్ ఐ ఆర్ –హ్యూమన్ రిసోర్స్ డెవలప్ మెంట్ సెంటర్ (సి ఎస్ ఐ ఆర్– హెచ్ ఆర్ డి సి) సమన్వయం ఈకార్యక్రమాన్ని సమన్వయం చేసింది. ఈ కార్యక్రమానికి రిజిస్టర్ చేసుకున్న 350 మందిలో బంగ్లాదేశ్, కంబోడియా, ఇరాన్ (ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్), ఇండోనేషియా, జోర్డాన్, లెబనాన్, మలేషియా, నేపాల్, పాకిస్తాన్, ఫిలిప్పీన్స్, రిపబ్లిక్ ఆఫ్ కొరియా, శ్రీలంక, థాయ్ లాండ్, ట్రినిడాడ్ అండ్ టొబాగో, ఉజ్బెకిస్తాన్ వంటి 17 దేశాల నుండి 36 మంది అంతర్జాతీయ భాగస్వాములుగా ఉన్నారు. సుమారు 70 మంది భౌతికంగాపాల్గొన్నారు.

ప్యానలిస్టులు ఎఫ్ఏవో, ఐఎల్ఆర్ఐ, ఐఎస్ఏ, డీడబ్ల్యూఐహెచ్, యూకేఆర్ఐ, ఆర్ఐఎస్ వంటి అంతర్జాతీయ సంస్థలు; సిఎస్ఐఆర్– ఎన్ బి ఆర్ ఐ , ఐఐటిడి, ఎస్ పిఎమ్ వివి, సిఎస్ఐఆర్–ఎన్ సిఎల్, వెంచర్ సెంటర్ వంటి భారతీయ జాతీయ సంస్థలు; పి ఎస్ ఎ ఆఫీసు, ఎం ఓ ఇ ఇన్నోవేషన్ సెల్ వంటి ప్రభుత్వ శాఖలు, ఎన్ ఆర్ డి సి వంటి ప్రభుత్వ రంగ సంస్థలు, ఇంటర్నేషనల్ ట్రాక్టర్లు, ఐఓసిఎల్, టాటా పవర్ కంపెనీ లిమిటెడ్, అంకుర్ సీడ్స్ , మహికో ప్రయివేట్ లిమిటెడ్ వంటి ఎక్స్ లెన్స్ పరిశ్రమలు; రీసెర్చ్ పార్కులు, ఇంక్యుబేషన్ సెంటర్లు, స్టార్టప్ ల ప్యానలిస్తులు, సభ్య దేశాల ప్రతినిధులు , ఎన్ ఐ టి , అరుణాచల్ ప్రదేశ్, జి ఎస్ బి టి ఎం , సి ఎస్ ఐ ఆర్ – ఎన్ ఇ ఐ ఎస్ టి , సి ఎస్ ఐ ఆర్ –సి ఎస్ ఐ ఆర్, సి టి ఎ ఇ, ఉదయపూర్, సి ఎస్ ఐ ఆర్ – ఎన్ ఎ ఎల్ ,ఇగ్నో, శివ్ నాడార్ విశ్వ విద్యాలయం, ఢిల్లీ విశ్వవిద్యాలయం, ఐఐటిడి, ఐఐటి మండి, ఐఐటి రూర్కీ, ఐఐటి ఇండోర్, అనేక ఇంక్యుబేషన్ హబ్ లు, డి ఎస్ ఐఆర్ , సిఎస్ ఐఆర్ ప్రధాన కార్యాలయం , సిఎస్ఐఆర్–ఐ ఐ పి , సిఎస్ఐఆర్–ఎన్ ఐ ఎస్ సి పి ఆర్ , ఎన్ ఆర్ డి సి, ఎ పి సి టి టి వంటి జాతీయ సంస్థలప్రతినిధులు పాల్గొన్నారు.

సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (డిఎస్ఐఆర్) కార్యదర్శి డాక్టర్ ఎన్ కల్లైసెల్వి , కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సిఎస్ఐఆర్) డైరెక్టర్ జనరల్ ఈ వర్క్ షాప్ ను ఆన్ లైన్ లో ప్రారంభించారు. ప్రారంభోపన్యాసం చేస్తూ, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, క్రాస్ బోర్డర్ ఇన్నోవేషన్ ప్రాముఖ్యత గురించి , సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడంలో, వాటిని పరిశ్రమలకు బదిలీ చేయడంలో సిఎస్ఐఆర్ సమిష్టి కృషి గురించి ఆమె వివరించారు. అంతిమంగా సమాజానికి చేరుకునే సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయాలని ఆమె సలహా ఇచ్చారు. ఎస్ డిజి 2 ఎస్ డిజి 7 , ఎస్ డిజి 9 కింద లక్ష్యాలను సాధించడానికి రోడ్ మ్యాప్ గురించి చర్చించడానికి ఆవిష్కర్తలు, పరిశ్రమ, పరిశోధన , అభివృద్ధి ప్రయోగశాలలు, అకాడెమియా, ఎంఎస్ ఎమ్ ఈ, స్టార్టప్ లు, పెద్ద పరిశ్రమలు, ఇంక్యుబేషన్ సెంటర్లు, విధాన రూపకర్తలు , ఇతర భాగస్వాములను ఈ వర్క్ షాప్ ఒక ఉమ్మడి వేదికపైకి తీసుకు వచ్చిందని ఆమె అభినందించారు.

డాక్టర్ పర్వీందర్ మైనీ, సైంటిఫిక్ సెక్రటరీ, ఆఫీస్ ఆఫ్ ప్రిన్సిపల్ సైంటిఫిక్ అడ్వైజర్, భారత ప్రభుత్వం; డిఎస్ఐఆర్ సంయుక్త కార్యదర్శి శ్రీ సురీందర్ పాల్ సింగ్, ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ అజయ్ మాథుర్, డిఎఎడి రీజనల్ ఆఫీస్ , డిడబ్ల్యుఐహెచ్, న్యూ ఢిల్లీ డైరెక్టర్ డాక్టర్ కట్జా లాన్స్, శ్రీమతి రెబెక్కా ఫెయిర్ బైర్న్, సైన్స్ అండ్ ఇన్నోవేషన్ హెడ్, యుకె రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ (యుకెఆర్ఐ), యుకె ప్రభుత్వం, డాక్టర్ హబీబర్ రెహమాన్, ఇంటర్నేషనల్ లైవ్ స్టాక్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఐఎల్ఆర్ఐ) రీజనల్ రిప్రజెంటివ్, దక్షిణాసియా, తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జమున దువ్వూరు, న్యూఢిల్లీ లోని ఇండియా అండ్ సైన్స్ డిప్లొమసీ ఫెలో, రీసెర్చ్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ డెవలపింగ్ కంట్రీస్ (ఆర్ఐఎస్) డాక్టర్ భాస్కర్ బాలకృష్ణన్, ఎపిసిటిటి–ఎస్కేప్ అధిపతి డాక్టర్ ప్రీతి సోని, సి ఎస్ ఐ ఆర్–ఇంటర్నేషనల్ ఎస్ అండ్ టి అఫైర్స్ డైరెక్టరేట్ (ఐఎస్ టిఎడి) అధిపతి డాక్టర్ రామ స్వామి బన్సాల్, సిఎస్ఐఆర్–హెచ్ ఆర్ డి సి అధిపతి డాక్టర్ ఆర్ కె సిన్హా వ్యక్తిగతంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నష్టానికి, వైఫల్యానికి గురయ్యే అవకాశం ఉన్నప్పటికీ మనుగడ, పోటీతత్వం , మార్కెట్ శక్తిని పెంచడానికి సృజనాత్మకత అవసరం" అని డాక్టర్ పర్వీందర్ మైనీ నొక్కి చెప్పారు. భారతదేశ విధానం యొక్క అవలోకనాన్ని ఇచ్చింది మరియు కొన్ని దృష్టి రంగాలు అంటే పరిశ్రమ నుండి పరిశోధన , అభివృద్ధి వ్యయంపెంపు, ; పరిశోధన , అభివృద్ధిలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్డిఐ)?; పరిశోధన – అభివృద్ధి ఎగుమతుల్లో పెరుగుదల; సెంట్రల్ పబ్లిక్ సెక్టార్ ఎంటర్ప్రైజెస్ ద్వారా ఆర్ అండ్ డి; కొన్ని ఆర్ అండ్ డిలో ఖర్చు చేయడం కోసం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ మార్గదర్శకాలు, టెక్నాలజీ బదిలీ ,స్టార్టప్ ఎకోసిస్టమ్ ని పెంపొందించడం కోసం భారత దేశ విధానం, దృష్టి పెట్టవలసిన కొన్ని రంగాలు గురించి ఆమె వివరించారు.

డిఎస్ఐఆర్ సంయుక్త కార్యదర్శి శ్రీ సురీందర్ పాల్ సింగ్ మాట్లాడుతూ,ఈ వర్క్‌షాప్ భారతదేశంతో సహా ఎపిసిటిటి సభ్య దేశాలకు తమ అవసరాలను పంచుకోవడానికి , సరిహద్దుల మధ్య ఆవిష్కరణలపై అవకాశాలను, అంతర్జాతీయ సహకారాన్ని వేగవంతం చేయడానికి , అంతర్జాతీయ టెక్నాలజీ బదిలీలో సవాళ్లను గుర్తించడానికి బలమైన వేదికను అందిస్తుందని అన్నారు.

డా. కట్జా లాన్స్, శ్రీమతి రెబెక్కా ఫెయిర్‌బైర్న్ , డాక్టర్ హబీబర్ రెహమాన్ మాట్లాడుతూ, క్రాస్–బోర్డర్ ఇన్నోవేషన్ యాక్సిలరేషన్‌ను వేగవంతం చేయడానికి మరింత ఫలవంతమైన సహకారాన్ని ఆకాంక్షించారు. ప్రొఫెసర్ జమున దువ్వూరు మాట్లాడుతూ, ప్రభుత్వ నూతన విద్యా విధానం భారతదేశంలో మరింత ఆవిష్కరణలు , వ్యవస్థాపకతను ప్రోత్సహించడానికి ఒక ప్రభావవంతమైన అడుగు అని అన్నారు.

ఈ అంతర్జాతీయ వర్క్ షాప్ ను ఆవిష్కర్తల సామర్థ్యాన్ని బలోపేతం చేయడానికి , భారతదేశ ఆవిష్కర్తలు , ఏ పి సి సి టి సభ్య దేశాల మధ్య అనుభవం , మంచి అభ్యాసాల నుండి క్రాస్ లెర్నింగ్ ద్వారా ప్రాంతీయ సహకారాన్ని ప్రోత్సహించడానికి, క్రాస–బోర్డర్ టెక్నాలజీ బదిలీ కోసం సంభావ్య సహకార అవకాశాలు , వ్యూహాలను గుర్తించడానికి ఉద్దేశించారు. ఇది ఆసియా–పసిఫిక్ రీజియన్ లో సృజనాత్మకత, బదిలీ , సాంకేతిక పరిజ్ఞానాల వ్యాప్తి కి సంబంధించిన సవాళ్లు, యంత్రాంగాలు , మంచి విధానాలపై విజ్ఞానం , అవగాహనను పెంచింది; సరిహద్దుల వెంబడి బదిలీ , సాంకేతిక పరిజ్ఞానాల వ్యాప్తి కోసం ప్రాంతీయ సహకారాన్ని బలోపేతం చేయడానికి ఇది వినూత్న వ్యూహాలు , పద్ధతులను అన్వేషించింది;

సృజనాత్మకత , సాంకేతిక పరిజ్ఞాన బదిలీ కోసం ప్రాంతీయ సహకారాన్ని బలోపేతం చేయడానికి కీలకమైన సవాళ్లను పరిష్కరించడంపై వర్క్ షాప్ ప్యానెలిస్టులు సిఫారసులు చేశారు.

ఎస్ డి జి 2 (జీరో హంగర్), ఎస్ డి జి 7 (చౌకఅయిన, , పరిశుభ్రమైన ఇంధనం), ఎస్ డి జి 9 (ఇండస్ట్రీ–ఇన్నోవేషన్ –ఇన్ ఫ్రాస్ట్రక్చర్) లలో లక్ష్యాలను సాధించడం కోసం సవాళ్లను గుర్తించడం ఈ వర్క్ షాప్ లక్ష్యం. సెషన్ కింద, "ఎస్ డి జి కు మద్దతు ఇవ్వడానికి వాతావరణ–స్థితిస్థాపక వ్యవసాయం, పశుసంవర్ధకం

కోసం అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాలు", ఉత్పాదక వ్యవసాయం, పశుసంవర్ధక ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐ ఒ టి), రోబోటిక్స్, డ్రోన్లు, ఎనర్జీ స్థితిస్థాపక సంరక్షణ , మెరుగైన ఎంపిక కోసం ఇంధన స్థితిస్థాపక సంరక్షణ , బయోటెక్నాలజీ, దిగుబడి మెరుగుదల, వ్యాధి నిరోధకత, ఖచ్చితమైన వ్యవసాయం, ఖచ్చితమైన పోషక పంపిణీలు, సృజనాత్మకత , విధాన దృక్పథాల పై చర్చిం చారు. సి ఎస్ ఐ ఆర్ – ఐ ఎస్ టి ఎ డి ప్రిన్సిపల్ సైంటిస్ట్, డాక్టర్ ఆనంద్ మోహిత్ చర్చను సమన్వయ పరిచారు. స్మార్ట్ , శీతోష్ణస్థితిని తట్టుకునే వ్యవసాయం, ఉత్పాదక వ్యవసాయం కోసం పంట సాగు సాంకేతికత, ఖచ్చితమైన వ్యవసాయం, ఖచ్చితమైన పోషకాహార పంపిణీ, పశుపోషణ , సృజనాత్మకత – గ్లోబల్, భారతదేశ దృక్పథాల పై నిర్మాణాత్మక చర్చ జరిగింది.

ఈ సెషన్ లో భాగంగా, "ఎస్ డి జి 7కు మద్దతు ఇవ్వడానికి ఇంధనం లో ఆకుపచ్చ , తక్కువ కార్బన్ అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాలు", మెటీరియల్ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్, ప్రొడక్షన్ టెక్నాలజీ, పవర్ ఎలక్ట్రానిక్స్, ఎనర్జీ స్టోరేజీ శ్రీ, ప్రత్యామ్నాయ ఎనర్జీ కోసం మేనేజ్ మెంట్ (సోలార్, ఆఫ్ షోర్, విండ్ మొదలైనవి), గ్రీన్ హైడ్రోజన్, కార్బన్–నెగటివ్ టెక్నాలజీలు, ఓషన్ బయోమాస్, బయోఫ్యూయల్, 5 జి ఆధారిత స్మార్ట్ గ్రిడ్ లు, క్లైమేట్ ప్రొటెక్షన్, సస్టెయినబిలిటీ మొదలైన వాటిపై చర్చించారు.

ఎనర్జీ సెక్టార్ లో గ్రీన్ అండ్ తక్కువ కార్బన్ టెక్నాలజీలకు సంబంధించిన వివిధ సవాళ్లు, పరిశోధన , అభివృద్ధి ,ఇన్నోవేషన్ ,పాలసీ సమస్యలు; గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి , స్టోరేజీ , హైడ్రోజన్ ని రవాణా ఇంధనంగా ఉపయోగించడం,

శిలాజ ఇంధనాలు, స్మార్ట్ గ్రిడ్ లు, ఇంధన శక్తి సమర్థత కోసం విద్యుత్ రంగంలో ఐ ఒ టి , ఎం ఎల్ , సి పి ఎస్ వంటి అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీల్లో హైడ్రోజన్ మిశ్రమం, గ్రీన్ ఎనర్జీ , సుస్థిరత; పునరుత్పాదక శక్తిని చొప్పించడానికి వివిధ కంట్రోలర్ ల (ఎసి–డిసి అండ్ డిసి–డిసి) అభివృద్ధి , ఇప్పటికే ఉన్న గ్రిడ్ లను స్థితిస్థాపకంగా మార్చడానికి సంబంధించిన సమస్యలు మొదలైన అంశాలు కూడా చర్చకు వచ్చాయి.

సెషన్ కింద, "ఎస్ డి జి 9 కు మద్దతు ఇవ్వడానికి సృజనాత్మకత, టెక్నాలజీ ప్రమోషన్ , వాణిజ్యీకరణలో ప్రక్రియ , కీలక అడ్డంకులు", అవకాశాలు, సవాళ్లు దేశాలు ఏ విధంగా టెక్నాలజీ ఫార్ములేషన్ అన్వయ చక్రాలను వేగవంతం చేయగలవనే దానిపై మార్గదర్శకత్వం గురించి చర్చలు జరిగాయి. భారతదేశం, జర్మనీ, యుకె ల్లోనూ, ఏ పి సి సి టి సభ్య దేశాల్లోనూ ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్, అవకాశాలు, సవాళ్ల కు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు.

చివరగా, "టెక్నో–కమర్షియల్ వాల్యూ అసెస్ మెంట్, టెక్నో–ఎకనామిక్స్, మార్కెటబిలిటీ, ఇన్నోవేటివ్ టెక్నాలజీస్ స్థోమత" పై ప్యానెల్ డిస్కషన్ లు జరిగాయి. కంబోడియా, నేపాల్, ఉజ్బెకిస్థాన్, థాయ్ లాండ్, ఇండియా వంటి దేశాలకు చెందిన వివిధ ఆవిష్కర్తలు తమ స్టార్టప్ ల గురించి కేస్ స్టడీస్ గా చర్చించారు. పూణేలోని ఎకోజెన్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కో ఫౌండర్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ శ్రీ వివేక్ పాండే, కాన్పూర్ లోని ఇ–స్పిన్ నానోటెక్ ప్రయివేట్ లిమిటెడ్, ఇండిమా ఫైబర్స్ ప్రయివేట్ లిమిటెడ్ డైరెక్టర్ డాక్టర్ సందీప్ పాటిల్, డిఎస్ఐఆర్ స్కీం, టెప్ , ప్రిస్మ్ ల నుండి గ్రాడ్యుయేట్ అయిన విజయవంతమైన స్టార్టప్ లు, ప్యానెల్ డిస్కషన్ సందర్భంగా భారతదేశానికి ప్రాతినిధ్యం వహించారు.

డి.ఎస్.ఐ.ఆర్. కార్యదర్శి , సి.ఎస్.ఐ.ఆర్ భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎన్. కలైసెల్వి ముగింపు ఉపన్యాసం చేశారు. క్రాస్ బోర్డర్ టెక్నాలజీ బదిలీ, సాధ్యమైన సిఫార్సుల క్లిష్టమైన సవాళ్లపై వర్క్‌షాప్ ఫలితాలను ఆమె సమీక్షించారు. సమీప భవిష్యత్తులో విజయవంతమైన సాంకేతిక బదిలీలు/స్టార్ట్–అప్‌లను వర్క్‌షాప్ ఫలితంగా ఆకాంక్షించారు.ఏ పి సి టి టి– యు ఎన్ ఇ ఎస్ సి ఎ పి హెడ్ డాక్టర్ ప్రీతి సోని , డిఎస్ఐఆర్ , యు ఎన్ ఇ ఎస్ సి ఇ పి –ఎపిసిటిటి కి చెందిన నేషనల్ ఫోకల్ పాయింట్ (ఇండియా) డిఎస్ఐఆర్ మరియు నేషనల్ ఫోకల్ పాయింట్ (ఇండియా) శాస్త్రవేత్త డాక్టర్ రామానుజ్ బెనర్జీ

ముగింపు వ్యాఖ్యలు, చర్చలపై వివరణతో కార్యక్రమం ముగిసింది. తరువాత సి ఎస్ ఐ ఆర్ – హెచ్ ఆర్ డి సి ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ వినయ్ కుమార్ వందన సమర్పణ చేస్తూ హాజరైన భారతదేశం , ఏ పి సి సి టి సభ్య దేశాల ప్రముఖులు, ప్యానెలిస్ట్‌లు, వక్తలు, ఇతరులకు స్పీకర్లు ధన్యవాదాలు తెలిపారు.

బాలి లో జి-20 శిఖర సమ్మేళనం జరుగుతున్న క్రమంలో సింగపూర్ ప్రధానితో సమావేశమైన ప్రధాన మంత్రి

న్యూఢిల్ల